


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 160, పేజీలు - 08

బుధవారం, నవంబర్ 19, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## 30 వేల ఎకరాల్లో తెలంగాణలో

# కొత్త నగరం



- తెలంగాణ ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరిన ముఖ్యమంత్రి
- ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలన్న రేవంత్ రెడ్డి
- ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందన్న సీఎం

**దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హెూటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు.**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం (నవంబర్ 18) హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో జరిగిన పట్టణాభివృద్ధి ప్రాంతీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ తో పాటు పలు రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ అభివృద్ధికి, ముఖ్యంగా ప్రతిష్టాత్మక 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టుకు కేంద్రం నుంచి తక్షణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

**ఫ్యూచర్ సిటీ ..**

**30 వేల ఎకరాల్లో భారీ నిర్మాణం..**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

2లో..

## ఎలక్షన్ మోడ్ కాదు

# ఎమోషనల్ మోడ్

- ప్రధాని ప్రసంగంపై శశి థరూర్ పోస్ట్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ సీనియర్ ఎంపీ శశి థరూర్ మరోసారి తన సొంత పార్టీ నాయకత్వం నుంచి విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉంది. మంగళవారం ఆయన ప్రధాని మోదీ ప్రసంగాన్ని పొగడటంతో ఈ వివాదం తలెత్తింది. ఇంతకు ముందు కూడా శశి థరూర్ ప్రధానిపై ప్రశంసలు కురిపించిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు దీనిని సుముఖంగా స్వీకరించే అవకాశం లేదు.

ఢిల్లీలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న శశి థరూర్ ప్రధాని మోదీ ప్రసంగం గురించి ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ప్రధాని మోదీ దేశ అభివృద్ధి కోసం

2లో..

# మళ్లీ 'అమరావతి' ఉద్యమం!

**- టీడీపీపై తిరుగుబాటేనా..?**



అమరావతి (ప్రశ్న న్యూస్) వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో అమరావతి ఎంతలా నిర్వీర్యం అయిందో తెలుసు. ఇప్పటికీ అప్పటి పరిస్థితులను తలుచుకొని ఆందోళనకు గురవుతున్నారు అమరావతి రైతులు. అందుకే మరోసారి అలాంటి పరిస్థితి రాకుండా చేయాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించి, ఎవరూ కదిలించలేని స్థితికి చేర్చాలని విన్నవిస్తున్నారు. ఆపై అమరావతిపై వైయస్సార్ కాంగ్రెస్ చేసిన ప్రయోగాల నుంచి విముక్తి కల్పించాలని కూడా కోరుతున్నారు. ఇప్పటివరకు కూటమి ప్రభుత్వంపై సానుకూలంగా ఉన్న అమరావతి రైతులు ఈ విషయంలో మాత్రం, అవసరం అనుకుంటే ఉద్యమించాలని చూస్తున్నారు. ప్రధాన కారణం నాటి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలే.

**ఏకాభిప్రాయంతో అమరావతి..**

2014లో అధికారంలోకి వచ్చింది టిడిపి ప్రభుత్వం. నవ్యాంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రి అయ్యారు చంద్రబాబు. ఆ సమయంలో అందరి ఏకాభిప్రాయంతో అమరావతిని రాజధానిగా ఎంపిక చేశారు.

2లో..

## శబరిమలకు పోటెత్తిన భక్తులు

**సౌకర్యాల లేమితో స్వాములకు తీవ్ర ఇబ్బందులు**



శబరిమల(ప్రశ్న న్యూస్) శబరిమలలో రెండు నెలల పాటు జరిగే మండల-మకరవిళక్కు యాత్రా సీజన్ గందరగోళంతో ప్రారంభమైంది. విపరీతమైన రద్దీ, కనీస సౌకర్యాల లేమి, అధికారుల వైఫల్యంతో అయ్యప్ప భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం నాడు రద్దీని నియంత్రించేందుకు దర్శన సమయాన్ని రెండు గంటల పాటు పొడిగించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. వర్చువల్ క్యూ, స్పాట్ బుకింగ్ ద్వారా రోజుకు 90 వేల మందికి

2లో..

## అర్బన్ నక్సలైట్లను నమ్మి

# మోసపోకండి

**- మావోయిస్టులకు బండి సంజయ్ పిలుపు**

- ఏ పార్టీ అధికారంలో ఉన్నా అర్బన్ నక్సలైట్లు పైరవీలు చేసుకుంటారని ఆరోపణ
- అర్బన్ నక్సలైట్ల మాటలు నమ్మి అమాయక పేదలు తుపాకీ పట్టి అడవుల్లో తిరుగుతున్నారని విమర్శ
- అర్బన్ నక్సలైట్లు దేశద్రోహులంటూ ఫైర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మావోయిస్టులు అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోవద్దని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అర్బన్ నక్సలైట్లు పైరవీలు చేసుకుంటూ ఆస్తులు పోగేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల పర్యటనకు వచ్చిన ఆయన వేములవాడ ఏరియా ఆసుపత్రికి రూ. 1.5 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మావోయిస్టులు అర్బన్ నక్సలైట్ల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. వారి మాటలు నమ్మి అమాయక పేదలు తుపాకీ పట్టి అడవుల్లో తిండి తిప్పలు లేక తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల చావుకు అర్బన్ నక్సలైట్లు కారణమని అన్నారు. అర్బన్ నక్సలైట్లు

2లో..

## తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

**- 2015 గ్రూప్-2 ఫలితాలు రద్దు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో 2015లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఫలితాలపై హైకోర్టు తాజాగా సంచలన తీర్పు ఇచ్చింది. దాదాపు ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఈ న్యాయపోరాటం వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తును ప్రభావితం చేయనుంది. 2019లో టీజీపీఎసి విడుదల చేసిన తుది సెలక్షన్ లిస్ట్‌ను హైకోర్టు పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కీలక నిర్ణయానికి ప్రధాన కారణం .. పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలు. 2015 గ్రూప్-2 పరీక్షలకు సంబంధించిన ఓఎంఆర్ షీట్లు ట్యాంపరింగ్‌కు గురయ్యాయని పేర్కొంటూ గతంలో కొందరు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఈ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పనితీరుపై తీవ్ర విమర్శలకు దారి తీశాయి. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా టీజీపీ

2లో..

## ఐబొమ్మ రవి కేసులో

# ఈడీ రంగప్రవేశం

**- మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానం**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐ-బొమ్మ' కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీగా ఆర్థిక అవకతవకలు, మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానిస్తున్న ఈడీ, లోతైన దర్యాప్తు చేపట్టేందుకు సమాయత్తమవుతోంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను తమకు అందించాలని కోరుతూ ఈడీ అధికారులు హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశారు. పోలీసుల నుంచి వివరాలు అందిన వెంటనే ఈడీ అధికారులు తమ విచారణను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఐ-బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవికి

2లో..

# ధాన్యం కొనుగోళ్లలో సరికొత్త రికార్డు



**- 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి రూ.560 కోట్లు జమ**

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. మంగళవారం నాటికి 32,793 మంది రైతుల నుంచి 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, వారి ఖాతాల్లో రూ.560.48 కోట్లను జమ చేశామని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 30 శాతం అధికమని ఆయన వెల్లడించారు. విజయవాడ రూరల్ కానూరులోని సివిల్ సప్లైస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ధాన్యం కొనుగోళ్ల పురోగతిని వివరించారు. రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ, నిజాయతీగా కొనుగోళ్లు జరుపుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో దాదాపు 16,000 మంది సిబ్బంది ఈ ప్రక్రియలో నిమగ్నమై ఉన్నారని, జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 1,81,885

2లో..

# బీఆర్ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదు

- కుట్ర చేసి తనను పార్టీ నుంచి బయటకు పంపారని ఆరోపణ
- ప్రస్తుతానికి కొత్త పార్టీ ఆలోచన లేదని వెల్లడి
- భవిష్యత్తులో తామే బాధ్యతాయుత ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని ప్రకటన

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ పార్టీపై, తన రాజకీయ భవిష్యత్తుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌తో తనకు ఇప్పుడు ఎలాంటి సంబంధం లేదని, కుట్రపూరితంగా తనను, తన కుటుంబాన్ని పార్టీకి దూరం చేశారని ఆరోపించారు. ప్రస్తుతానికి కొత్త రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేశారని, ఆ పార్టీతో తన బంధం తెగిపోయిందని కవిత తేల్చిచెప్పారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరరావును పార్టీ వదులుకోవడమే బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణమని విశ్లేషించారు. తుమ్మల లాంటి నేతను దూరం చేసుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పని అన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు తనకు, జాగృతి కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరిగిందని, కనీస గుర్తింపు కూడా లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. (తెలంగాణలో అధికార, ప్రతిపక్షాలు రెండూ తమ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యాయని కవిత విమర్శించారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో తామే బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను పోషిస్తామని ప్రకటించారు. సామాజిక తెలంగాణ సాధనే తన

2లో..



ప్రజాప్రశ్న
హైదరాబాద్ బుధవారం 19, నవంబర్ 2025

# 30 వేల ఎకరాల్లో తెలంగాణలో కొత్త నగరం

ఈ భారీ పట్టణాభివృద్ధి ప్రాజెక్టు కేవలం తెలంగాణకే కాకుండా యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని సీఎం అన్నారు. అయితే ఈ ప్రాజెక్టును విజయవంతం చేయడానికి, ప్రామాణిక అనుమతులు , నిధుల మద్దతు విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం కావాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు.

### కేంద్ర ప్రాజెక్టులకు అనుమతుల కోసం వినతి

రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఉద్దేశించిన మూడు కీలక ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు తక్షణమే ఇవ్వాలని రేవంత్ రెడ్డి కోరారు. అందులో మొదటిది మూసీ పునరుజ్జీవం. హైదరాబాద్‌లోని మూసీ నదిని పునరుద్ధరించి, నదీ తీరాన్ని అభివృద్ధి చేసే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు అనుమతి. రెండోది రీజినల్ రింగ్ రోడ్డు. నగర శివార్లలో భారీ ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించిన రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి త్వరగా నిధులు కేటాయించాలని కోరారు. మూడోది మెట్రో రైలు విస్తరణ. నగర రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి మెట్రో రైలు మార్గాల విస్తరణకు అనుమతి.

### 'రైజింగ్ తెలంగాణ విజన్ 2047'

దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. భారతదేశం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవడంలో తెలంగాణ రాష్ట్రం 10 శాతం వాటాను అందించాలని చూస్తున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాలను చేరడానికి, డిసెంబర్ 9న 'రైజింగ్ తెలంగాణ విజన్ 2047' డాక్యుమెంట్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇంకా పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి, రాబోయే మూడేళ్లలో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులనే నడుపుతామని హామీ ఇచ్చారు. ఈ విధంగా అన్ని రంగాలలో తెలంగాణను ఆదర్శంగా నిలబెట్టడానికి కేంద్రం సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు.

# ఎలక్షన్ మోడ్ కాదు ఎమోషనల్ మోడ్

నిర్మాణాత్మక అసహనాన్ని గురించి మాట్లాడారని, వలసవాద అనంతర ఆలోచనా విధానాన్ని బలంగా ప్రోత్సహించారని థరూర్ తెలిపారు. ఇండియా కేవలం ఎమర్జింగ్ మార్కెట్ మాత్రమే కాదు, ప్రపంచానికి ఎమర్జింగ్ మోడల్‌గా మారుతోందని మోదీ పేర్కొన్నారని, కరోనా మహమ్మారి వంటి ప్రపంచ సంక్షోభాల నుంచి బయటపడటం, ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితులను ఎదుర్కోవడంలో భారత్ ఆర్థిక స్థిరత్వాన్ని ప్రపంచం గుర్తించిందని ప్రధాని చెప్పారని శశి థరూర్ పేర్కొన్నారు. మోదీ ఎప్పుడూ ఎన్నికల మోడ్‌లోనే ఉంటారని తనపై ఆరోపణలు ఉన్నాయని.. అయితే నిజంగా ప్రజల సమస్యలను పరిష్కరించే ఎమోషనల్ మోడ్‌లో ఉన్నట్లు ప్రధాని చెప్పినట్లు శశి థరూర్ వివరించారు.

### మెకాలే వారసత్వంపై ప్రధాని మోదీ

ప్రధాని తన ప్రసంగంలో వలసవాదం, విద్యపై మెకాలే ప్రభావం గురించి ఎక్కువగా ప్రస్తావించారు. "భారతీయ విద్యపై మెకాలే సృష్టించిన 200 ఏళ్ల 'బానిస మనస్తత్వం' వారసత్వాన్ని తిరగరాయడం" ప్రసంగంలో కీలక అంశమని శశి థరూర్ తెలిపారు. భారతదేశ వారసత్వం, భాషలు, విజ్ఞాన వ్యవస్థల పట్ల గర్వాన్ని పునరుద్ధరించడానికి 10 ఏళ్ల జాతీయ లక్ష్యాన్ని చేపట్టాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. "మొత్తం మీద, ఈ ప్రసంగం ఆర్థిక దృక్పథాన్ని, సాంస్కృతిక కార్యాచరణకు పిలుపునిచ్చింది. ఈ ప్రసంగాన్ని ప్రేక్షకుడిగా విన్నందుకు సంతోషంగా ఉంది," అని శశ థరూర్ ముగించారు.

### కాంగ్రెస్‌తో పెరిగిన దూరం

శశి థరూర్ చేసిన ఈ ప్రశంసలు కాంగ్రెస్ పార్టీలో మరింత ఉద్రిక్తతకు దారితీయవచ్చు. గత కొన్ని నెలలుగా శశి థరూర్, కాంగ్రెస్ పార్టీ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అంతకు ముందు కూడా ప్రధాని మోదీని 'ప్రధాన ఆస్తి' అని అభివర్ణించడం, టెర్రర్ అటాక్ సంక్షోభాన్ని ఆయన నిర్వహించిన తీరును పొగడటం వంటి వ్యాఖ్యలతో శశి థరూర్ కాంగ్రెస్ నాయకుల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత స్నేహపూర్వక దేశాలకు వెళ్లిన ప్రభుత్వ ప్రతినిధి బృందంలో శశి థరూర్ ప్రతిపక్ష నేతగా ఎంపికైనప్పటి నుంచి ఆయన బీజేపీలోకి మారనున్నారనే గుసగుసలు పెరిగాయి. అయితే, "తాను బీజేపీలో చేరడం లేదని, ఇది జాతీయ ఐక్యతకు సంబంధించిన అంశం" అని థరూర్ జూన్‌లో స్పష్టం చేశారు. శశి థరూర్ గతంలో 'జీ-23' నాయకుల బృందంలో భాగమై గాంధీ కుటుంబ నాయకత్వ శైలిపై అసంతృప్తి వ్యక్తం చేయడం, పార్టీ అధ్యక్ష పదవికి పోటీ చేయడం వంటి అంశాలు కూడా కాంగ్రెస్‌లో ఆయన స్థానాన్ని సందిగ్ధంలో పడేశాయి.

# అర్బన్ నక్సలైట్లను నమ్మి మోసపోకండి

దేశద్రోహులని ఆయన మండిపడ్డారు. నక్సలైట్లు ఇప్పటికైనా తుపాకీని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవడానికి మరో నాలుగు నెలల గడువు మాత్రమే ఉందని అన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని ఆయన పేర్కొన్నారు.

# శబరిమలకు పోటెత్తిన భక్తులు...

మాత్రమే దర్శనం కల్పించాలని నిర్ణయించినప్పటికీ, సోమవారం నుంచి రోజుకు లక్షకు పైగా భక్తులు వస్తుండటంతో ఏర్పాట్లు సరిపోలేదు. స్వామివారి దర్శనం కోసం భక్తులు 10 నుంచి 15 గంటల పాటు క్యూలైన్లలో వేచి ఉండాల్సి వస్తోంది. పవిత్రమైన 18 మెట్ల వద్ద భక్తుల ప్రవాహం గణనీయంగా మందగించడంతో, సన్నిధానం నుంచి క్యూలైన్లు కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నాయి. త్రాగునీరు, ఆహారం అందక, గంటల తరబడి నిల్చోవడంతో చిన్నారులు, వృద్ధులు క్యూలైన్లలోనే సొమ్మసిల్లి పడిపోతున్నారు. ఏర్పాట్లు సరిగా లేవని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు నూతన అధ్యక్షుడు కె. జయకుమార్ స్వయంగా అంగీకరించారు. త్రాగునీటి కేంద్రాలు, బయో-టాయిలెట్లు, ఆహార సరఫరాలో లోపాలున్నాయని ఆయన తెలిపారు. రద్దీ నియంత్రణకు అవసరమైన కేంద్ర బలగాలైన ఎన్డీఆర్ఎఫ్, ఆర్ఏఎఫ్ అందుబాటులో లేకపోవడం, కేటాయించిన 18,000 మంది పోలీసులకు గాను కేవలం 3,500 మంది మాత్రమే విధుల్లో ఉండటంతో భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే, గత ఏడాది (2023) నాటి సంక్షోభం పునరావృతం అవుతుందని, ఎంతోమంది భక్తులు యాత్రను మధ్యలోనే విరమించుకోవాల్సి వస్తుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# మళ్లీ 'అమరావతి' ఉద్యమం!

అయితే పాలన గాడిలో పెట్టేందుకు దాదాపు ఏడాది పట్టింది. ఎందుకంటే అది విభజిత ఆంధ్రప్రదేశ్ కాబట్టి. ఏపీకి రాజధాని లేదు. ఎక్కడి నుంచి పాలన చేయాలో తెలియదు. అటువంటి సమయంలో పాలనను గాడిలో పెట్టి.. అమరావతి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆపై రాజకీయపరంగా ఎన్నెన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఐదేళ్ల పాలనాకాలం ఇట్టే ముగిసిపోయింది. అయితే రాజధానిని ఎంపిక చేసి పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు దానికి చట్టబద్ధత కల్పించలేకపోయారు. దీంతో తరువాత అధికారంలోకి వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ అమరావతి తో ఎంతలా ఆడుకోవాలో అంతలా ఆడుకుంది.

### ఆ ఇళ్ల పట్టాల రద్దు కోసం

వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల అంశం తెరపైకి వచ్చింది. కేవలం శాసన రాజధానిగా మాత్రమే అమరావతిని పరిమితం చేసింది వైసిపి ప్రభుత్వం. దీంతో అమరావతికి సేకరించిన వేల ఎకరాలను తిరిగి రైతులకు ఇవ్వలేదు. అలాగని మూడు రాజధానులు కట్టలేదు. అయితే ఆర్ 5 జోన్ అంటూ అమరావతి రైతులు ఇచ్చిన భూములను పేదలకు పని చేసేందుకు నిర్ణయించింది కూటమి ప్రభుత్వం. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న పేదలకు అమరావతిలో ప్లాట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఞ

కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఆర్5 జోన్ కేటాయింపులను రద్దు చేయాలని అమరావతి రైతులు కోరుతూ వచ్చారు. కానీ ఇంతవరకు కూటమి ప్రభుత్వం నుంచి చలనం లేదు. దీంతో వైసిపి హయాంలో యాక్టివ్ గా పని చేసిన అమరావతి ఐక్య కార్యాచరణ సమితి మరోసారి క్రియాశీలకం అయింది. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని చూస్తోంది.

### చట్టబద్ధత కోసం..

గతంలో చట్టబద్ధత కల్పించి ఉంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతిని కాదని.. మూడు రాజధానులను అస్సలు తెరపైకి తెచ్చే అవకాశం లేదని నమ్ముతున్నారు అమరావతి రైతులు. అయితే అప్పట్లో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా చట్టబద్ధత కాలేదు. కనీసం ఇప్పుడైనా చట్టబద్ధత కల్పిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు రావని అమరావతి రైతులు భావిస్తున్నారు. పైగా ఎన్డీఏలో టిడిపి కీలక భాగస్వామి. ఏపీ విషయంలో కేంద్రం ఉదారంగా వ్యవహరిస్తోంది. ఇటువంటి సమయంలో అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే చాలా ప్రయోజనం అని అమరావతి రైతులు భావిస్తున్నారు. ఒత్తిడి పెంచేందుకు అమరావతి ఐక్య కార్యాచరణ సమితి రంగంలోకి దిగింది. చూడాలి కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో.

# తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

ఎస్ఎంసి ఉల్లంఘించిందని జవాబు తీర్పు సందర్భంగా ధర్మాసనం స్పష్టం చేసింది. ఒక ప్రభుత్వ నియామక సంస్థ న్యాయస్థానం ఆదేశాలను పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

### 8 వారాల్లో కొత్త లిస్ట్ ఇవ్వాలని ఆదేశం

దీంతో హైకోర్టు TGPSCకి కఠిన ఆదేశాలు జారీ చేసింది.తక్షణమే రద్దయిన 2019 సెలక్షన్ లిస్ట్‌ను ఉపసంహరించుకోవాలి.వివాదాస్పదమైన %వాీ=% షీట్లను నిష్పాక్షికంగా రివాల్యుయేషన్ తిరిగి మూల్యాంకనం చేయాలి.ఈ ప్రక్రియ మొత్తాన్ని 8 వారాల్లో పూర్తి చేసి, కొత్తగా సవరించిన సెలక్షన్ లిస్ట్‌ను విడుదల చేయాలి. 8 వారాల్లో కొత్త లిస్ట్ ఇవ్వాలని ఆదేశం దీంతో హైకోర్టు కఠిన ఆదేశాలు జారీ చేసింది.తక్షణమే రద్దయిన 2019 సెలక్షన్ లిస్ట్‌ను ఉపసంహరించుకోవాలి. వివాదాస్పదమై షీట్లను నిష్పాక్షికంగా రివాల్యుయేషన్ తిరిగి మూల్యాంకనం చేయాలి.ఈ ప్రక్రియ మొత్తాన్ని 8 వారాల్లో పూర్తి చేసి, కొత్తగా సవరించిన సెలక్షన్ లిస్ట్‌ను విడుదల చేయాలి. తీర్పుతో ఒకవైపు ఇప్పటికే ఉద్యోగాలు పొందిన కొందరికి షాక్ తగిలినా, మరోవైపు న్యాయం జరగాలని పోరాడిన ఎంతో మంది అభ్యర్థులకు ఊరట లభించింది. పారదర్శకత, నిష్పాక్షికతతో ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు జరగాలనే సందేశాన్ని ఈ తీర్పు బలంగా ఇచ్చింది.

# ఐబొమ్మ రవి కేసులో ఈడీ రంగప్రవేశం

బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా భారీగా నిధులు అందినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అంతేకాకుండా, ఓ క్రిప్టో వాలెట్ నుంచి రవికి చెందిన ఎన్నారై ఖాతాకు ప్రతి నెలా రూ.15 లక్షలు బదిలీ అయినట్లు కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే విదేశీ నిధుల ప్రవాహం, హవాలా లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది. ఇప్పటికే పోలీసులు నిందితుడు రవికి చెందిన బ్యాంకు ఖాతాల్లోని సుమారు రూ.3.5 కోట్లను ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈడీ ఎంట్రీతో నిందితుడి బ్యాంకు ఖాతాల నిర్వహణ, నిధుల మళ్లింపుపై పూర్తి స్థాయిలో విచారణ జరగనుంది.

# ధాన్యం కొనుగోళ్లలో సరికొత్త రికార్డు

మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు జరిగిందని, ఈసారి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం వల్లే కొనుగోళ్లు పెరిగాయని అన్నారు. ధాన్యం అమ్మిన వారిలో చిన్న, సన్నకారు రైతులతో పాటు 6,600 మంది కౌలు రైతులు కూడా ఉన్నారని వివరించారు.ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని మంత్రి మనోహర్ తెలిపారు. ఈ ప్రక్రియను ఒక సవాలుగా తీసుకుని, దేశంలోనే తొలిసారిగా 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని గర్వంగా చెప్పారు. గుంటూరు జిల్లాకు చెందిన పత్తిపాటి సుబ్బారావు అనే రైతు ఖాతాలో 6 గంటల్లోనే రూ.2.08 లక్షలు, ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన నీలం త్రిమూర్తులు ఖాతాలో 5 గంటల్లోనే డబ్బులు జమ చేశామని ఉదాహరణగా పేర్కొన్నారు.సాంకేతికతను వినియోగిస్తూ రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. దేశంలోనే మొదటిసారిగా వాట్సాప్ ద్వారా రైతులు తమ ధాన్యాన్ని ఏ రోజు, ఏ మిల్లుకు అమ్మాలో వారే నిర్ణయించుకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు. 73373 59375 నంబర్‌కు 'హాయ్' అని సందేశం పంపితే, షెడ్యూల్ వివరాలు వాట్సాప్‌లోనే వస్తాయని, ఇప్పటివరకు 500 మంది రైతులు ఈ సేవలను వినియోగించుకున్నారని వివరించారు. రానున్న అల్పపీడన తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారు. రైతు భరోసా కేంద్రాల్లో 50 వేల టార్పాలిన్లను అందుబాటులో ఉంచామని, ఇప్పటికే 19 వేల టార్పాలిన్లను ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. గోనె సంచుల కొరత లేకుండా 6.34 కోట్ల గోతాలను సిద్ధం చేశామన్నారు. ఈ సీజన్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండీ ఎస్. ఢిల్లీ రావు కూడా పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదు

ఆశయమని, అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కవిత విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీలను మోసం చేస్తున్నారని, బీసీల ద్రోహిగా మిగిలిపోతారని ఆరోపించారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిందని ఎద్దేవా చేశారు. సీతారామ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని, పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలపై బుధవారం హైదరాబాద్‌లో సింగరేణి భవన్‌ను ముట్టడిస్తామని కవిత ప్రకటించారు.ఞ

## బస్ లో మర్చిపోయిన

# 6 తులాల బంగారం అప్పగింత

**- నిజాయితీ చాటుకున్న సిబ్బంది**






**సిరిసిల్ల(ప్రశ్న న్యూస్)** సిరిసిల్ల డిపో బస్ లో మర్చిపోయిన బంగారం మంగళవారం ప్రయాణికురాలు కీ అందజేశారు. వివరాల్లోకి వెళ్తే సిరిసిల్ల డిపో కీ చెందిన బస్ లో మంగళవారం ఉదయం సిరిసిల్ల నుండి జె బి ఎస్ వెళ్తున్న సర్వీస్ లో ఒక ప్రయాణికురాలు ప్రయాణిస్తూ ఆమె బ్యాగ్ లోని ఆరు తులా బంగారం, మరియు మొబైల్ ఫోన్ మర్చిపోయి దిగి పోవడం జరిగింది. అట్టి బ్యాగ్ నీ గమనించిన డ్యూటీ కండక్టర్ రామిండ్ల ప్రసాద్ స్టాఫ్ నెంబర్ 320722 డ్రైవర్ మురళీధర్ 322838 ఇద్దరు, తీసుకొని డిపో మేనేజర్ కి సమాచారం ఇచ్చి ఆయన సూచనల మేరకు డిపో లో అప్పజెప్పడం జరిగింది. అట్టి ప్రయాణికురాలు డిపో కీ వచ్చి సెక్యూరిటీ హెడ్ గార్డ్ సమక్షంలో అన్ని పరిశీలించి ఎర్నింగ్ సెక్షన్ లో డిసి ఆధ్వర్యంలో ప్రయాణికురాలకీ అందజేయడం జరిగింది. ప్రయాణికురాలు సిబ్బంది కీ కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

# రాజశేఖర్ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

షాద్‌నగర్, : షాద్‌నగర్, ఎల్లంపల్లి మీదుగా నవాబ్‌పేట వరకు ఎర్ర రాజశేఖర్ హత్యకేసుపై పోలీసులు విచారణ చేపట్టారు. ఫరూక్‌నగర్ మండలం ఎల్లంపల్లికి చెందిన దళిత యువకుడు రాజశేఖర్‌ను యువతి తండ్రి కాగు వెంకటేష్ చంపేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. షాద్‌నగర్ అయ్యప్ప కాలనీలో నివాసం ఉంటున్న రాజశేఖర్‌ను అక్కడి నుంచి ఎలా తరలించారు? ఎక్కడెక్కడికి తీసుకెళ్లారు? ఎక్కడ హత్య జరిగిందో? పూర్తి ఆధారాలు సేకరిస్తున్నారు. మరోవైపు రాజశేఖర్ మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు నిర్వహించిన అంత్యక్రియల్లో ఎలాంటి ఆందోళన జరగకుండా బందోబస్తు నిర్వహించారు. అంతిమయాత్రలో దళిత సంఘాల నాయకులు కరోళ్ల సురేందర్, జాంగారి రవి, సింగపాగ అనిల్ పాల్గొని నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

# అంగన్‌వాడీ చిన్నారులకు దుస్తులు అందేనా..?

అచ్చంపేట, : అంగన్‌వాడీ చిన్నారులకు దుస్తులు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించి అందుకోసం వస్త్రాలను పంపిణీ చేసింది. అవి వచ్చి మూడు నెలలు గడుస్తున్నా ఇంకా కార్యాలయంలోనే మూలుగుతున్నాయి. శిశు సంక్షేమశాఖ కార్యాలయంలోనే ఉంచారు. అంగన్‌వాడీలలో ఉండే చిన్నారులకు ఒక్కొక్కరికి రెండు జతలు కుట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చిన వస్త్రాల సంచులను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు అప్పగించాల్సి ఉంటుంది. వారు మహిళా సంఘాలకు అప్పగిస్తే కుట్టించి ఇస్తారు. ఇందుకుగాను షర్ట్, నిక్కరుకు రూ.80లు, ఫ్రాక్‌కు రూ.60ల చొప్పున మహిళా సంఘాలకు చెల్లిస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్ 15న వస్త్రాల సంచులు శిశు సంక్షేమశాఖ కార్యాలయానికి చేరగా వాటిని తీసుకెళ్లి కుట్టించి ఇవ్వాలని సెప్టెంబర్ 26న ఆ శాఖ వారు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు లేఖ రాశారు. ఆ రోజు నుంచి వాటిని తీసుకెళ్లకుండా ఇక్కడే ఉంచినట్లు తెలుస్తోంది.

# మృతుడు మహబూబ్ బాషాగా గుర్తింపు

ఆలంపూర్, : అయిజ పట్టణంలో డ్రైనేజీలో పడి మృతి చెందిన మహబూబ్ బాషా అనే వ్యక్తిని పోలీసులు గుర్తించారు. అతని కుటుంబ సభ్యులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ



వనపర్తి, : వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, వాటిని అరికట్టేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలను ఉపాధ్యాయులు వివరించారు. వీటిని అరికట్టడం సామాజిక బాధ్యతగా భావించాలని విద్యార్థులకు సూచించారు.

## మహిళా సంఘాల పేరుతో

# రూ.1.50 కోట్లు స్వాహా




కోదాడ, : నల్గొండ పట్టణంలోని 3వ వార్డు పాతపల్లెకు చెందిన 12 సంఘాల పేరున, గ్రామానికి చెందిన బుక్ కీపర్ బ్యాంకు ఫీల్డ్ అధికారులతో కుమ్మక్కై కోటిన్నర రూపాయల రుణాలు తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. నాలుగు నెలలుగా రుణాలు చెల్లించకపోవడంతో బ్యాంకు సిబ్బంది బాధితుల వద్దకు వెళ్ళగా, తమకు ఏమీ తెలియదని వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, బుక్ కీపర్ మరియు బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు బ్యాంకు ముందు నిరసన తెలిపారు.

### సాంప్రదాయాల పరిరక్షణలో గ్రామాల పాత్ర ముఖ్యం

సూర్యాపేట, : మోతె మండలం నామవరం గ్రామంలో మాజీ సర్పంచ్ మట్టిపల్లి వెంకన్న మనమరాళ్లకు నిర్వహించిన నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, స్థానిక నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్యే కుటుంబానికి ఆశీస్సులు అందిస్తూ, సాంప్రదాయాల పరిరక్షణలో గ్రామాల పాత్ర ముఖ్యమని పేర్కొన్నారు.

### సౌదీ రోడ్డు ప్రమాదం లో మృతులకు నివాళులు

తుంగతుర్తి, : సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు భారతీయులు మృతిచెందడంపై కోదాడకు చెందిన ముఫ్తీ అత్తహర్ మౌలానా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు, బంధువులకు ఆయన సంతాపం తెలిపారు. మానవ ప్రాణనష్టం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# సొమ్ములో కొంత.. సొంతానికి..!

భువనగిరి, : మహిళలకు ఆర్థిక సాధికారత, సామాజిక అభ్యున్నతి, సమానత్వం, జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశారు. సంఘాలకు బ్యాంకుల నుంచి పూచీ లేని రుణాలు ప్రభుత్వం అందిస్తోంది. లక్ష్యం ఉన్నతంగా ఉన్నా అక్కడక్కడా వీవోఏలు, బుక్ కీపర్లు, సంఘం అధ్యక్షులు, కింది స్థాయి సిబ్బంది వల్ల అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి.

## మంచిర్యాల జిల్లాకు జాతీయ అవార్డు

మంచిర్యాల, : మంచిర్యాల జిల్లాకు నీటి సంరక్షణ కార్యక్రమాల్లో విశిష్ట ప్రతిభకు గాను జల్ సంచయ్, జన్ భగీదరి నేషనల్ అవార్డు లభించింది. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఈ జాతీయ అవార్డును అందుకున్నారు. ఈ అరుదైన గౌరవం జిల్లాకు దక్కింది.

## ప్రతి ఏడాది జీవన్ ప్రమాణ్ సర్టిఫికెట్ సమర్పించాలి

చెన్నూరు, : సింగరేణి పదవీ విరమణ ఉద్యోగులు మందమర్రిలో ఏర్పాటుచేసిన డిజిటల్ లైవ్ సర్టిఫికెట్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని మందమర్రి ఏరియా జిఎం రాధాకృష్ణ తెలిపారు. క్యాంపు రెండవ రోజు ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నవంబర్లో జీవన్ ప్రమాణ సర్టిఫికెట్ సమర్పించాల్సిన అవసరం ఉందని, ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ క్యాంపు సింగరేణి సీఎంపిఎఫ్ గోదావరిఖని ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో వ్యాస పాటల పోటీలు సందడి



ఆసిఫాబాద్, : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఐదవ రోజున విద్యార్థులకు వ్యాసరచన, పాటల పోటీలతో ఘనంగా జరిగాయి. మున్సిపల్ కమిషనర్ గజానంద్, విశ్రాంత పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు గ్రంథాలయ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, న్యాయనిర్ణేతలు, లైబ్రేరియన్లు పాల్గొన్నారు.

## గ్రామ సర్పంచ్ ఎన్నికలు డిసెంబర్‌లో కాంగ్రెస్ అభ్యర్థులకు పిలుపు

సిర్పూర్, : ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు తెలిపిన వివరాల ప్రకారం, సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలు డిసెంబర్ రెండవ వారంలో నిర్వహించాలని నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్ ఆశావహులు ఆసిఫాబాద్ లోని డీసీసీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం సూచించారు.

## జోడేఘాట్ రహదారి పక్కన లోతైన గుంత: ప్రయాణికుల్లో భయాందోళనలు

బెల్లంపల్లి, : కెరమేరి మండలం కోపగుడ సమీపంలో జోడేఘాట్ రహదారి పక్కన సుమారు 50-60 అడుగుల లోతైన గుంత స్థానికులను, ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. రోడ్డుకు సమీపంలో ఉన్న ఈ గుంతలో వాహనాలు పడిపోయే ప్రమాదం ఉంది. సిఐటియు మండల కన్వీనర్ కూటికేల ఆనంద్ రావు మాట్లాడుతూ, అధికారులు వెంటనే ఈ గుంతను పరిశీలించి, ప్రమాద సూచికలు, రక్షణ గోడలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని సిఐటియు కోరుతోంది.

## సురేందర్ రెడ్డికి నేతల నివాళులు..!



ధర్మపురి, : ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్ రెడ్డి రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి నివాళులర్పించారు. సురేందర్ రెడ్డి అంకితభావంతో పనిచేసేవారని, అందరితోనూ కలివిడిగా ఉండేవారని వారు గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

జగిత్యాల, : జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్, అంతర్గాం, తాటిపల్లి, చల్ గల్, మోరపల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ రఘువరన్, డిఎస్ఓ జితేందర్ రెడ్డి, డిసిఓ మనోజ్ కుమార్, డిఎం జితేందర్ ప్రసాద్ వంటి అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

కోరుట్ల, : మంగళవారం, బీర్పూర్ మండలం తాళ్ల ధర్మారంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కింద 13 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ, అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు, నారపాక రమేష్, మహిపాల్ రెడ్డి, అశోక్, సల్ల లక్ష్మన్, బీర్పూర్ ఆలయ ఛైర్మన్ శ్రీనివాస్, ముక్క వెంకటేష్ యాదవ్, ఎంపీడీవో భీమేష్, ఎమ్మార్వో సుజాత తదితరులు పాల్గొన్నారు. ఈ పనుల ద్వారా స్థానిక మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయి.

## ఎమ్మెల్యేకు బిఆర్ఎస్ కండువా కప్పడానికి యత్నం!

పెద్దపల్లి, : బీర్పూర్ మండలం తాళ్ళదర్మారంలో అభివృద్ధి పనులకు భూమిపూజకు వస్తున్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌కు బీఆర్ఎస్ కండువా కప్పేందుకు వేచి చూసిన కార్యకర్తను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పార్టీ ఫిరాయింపులపై ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ఈ సంఘటన మంగళవారం నాడు జరిగింది.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలి

మంథని,: పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్ లో మంగళవారం నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ వేణు, డీసీపీ కరుణాకర్ లతో కలిసి జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బందిచే మాదక ద్రవ్యాల నిరోధన ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని, మాదకద్రవ్యాల నియంత్రణ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## సీబీఐ విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే దంపతులు

రామగుండం, : హైకోర్టు న్యాయవాది వామన్‌రావు దంపతుల హత్య కేసులో సీబీఐ విచారణకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు దంపతులు హాజరయ్యారు. రామగుండం పోలీసు కమిషనరేట్‌లో రెండు నెలలుగా సీబీఐ అధికారులు సాక్షులు, నిందితులను విచారిస్తున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు దంపతులను విచారణకు హాజరు కావాలని నోటీసు జారీ చేశారు. ఈ మేరకు వారిని మూడు గంటల పాటు విచారించారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన పుట్ట మధు విలేకరులతో మాట్లాడుతూ ఇది రాజకీయ కుట్ర మాత్రమేనన్నారు. తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకునేందుకు మంథని ఎమ్మెల్యే తెర వెనుక ఉండి తనపై హత్య కేసును మోపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

## పాల్వంచ బస్టాండ్ పరిశుభ్రతపై ఎమ్మెల్యే ఆగ్రహం



కొత్తగూడెం, : కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్వంచ ఆర్టీసీ బస్టాండ్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, పరిశుభ్రత లోపంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. పాల్వంచకు కొత్త బస్టాండ్ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయని, నిధుల కేటాయింపు, ప్రణాళికలపై దృష్టి సారించామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీలో మున్సిపల్, ఆర్టీసీ అధికారులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## కొడుకు, కోడలితో ప్రాణహాని వృద్ధ తల్లి కన్నీటి రోదన

భద్రాచలం, : తన చిన్న కొడుకు, కోడలు, కోడలి అన్నయ్య, బౌన్సర్ల నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనను కాపాడాలని వృద్ధ తల్లి ఎండి ముంతాజ్ బేగం (74) మంగళవారం పాల్వంచ ప్రెస్ క్లబ్లో కన్నీటి పర్యంతమయ్యారు. పాల్వంచ మండలం బసవతార కాలనీలో తన భర్త నిర్మించిన ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న ఆమె, బీపీ, షుగర్, థైరాయిడ్, హార్ట్ సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. తన చిన్న కుమారుడు ఎం.డి. రహమత్ ఖాన్, అతని భార్య గులాబ్ షా, ఆమె సోదరుడు ఇమ్రాన్, బౌన్సర్లు, ఇతర బంధువులు తరచూ ఇంటికి వచ్చి ఆస్తి మొత్తం తమకు రాసివ్వాలని బెదిరిస్తూ, దౌర్జన్యం చేస్తూ, చంపుతానని వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు.

## ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అంటే అవగాహన లేదు..

పినపాక, : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక శ్రద్ధతో 'ఎవ్రీ చైల్డ్ రీడ్స్' అనే కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో రెండున్నర నెలలుగా అమలుచేస్తున్నారు. ప్రతి విద్యార్థికి ఆంగ్ల అక్షరాలు, పదాలు, వాక్యాలు నేర్పేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ మాసాంతం వరకే అమల్లో ఉంటున్న నేపథ్యంలో మండల ప్రత్యేకాధికారులుగా ఉన్న జిల్లా అధికారులు వారంలో ఒకరోజు పాఠశాలలను సందర్శించి కార్యక్రమం అమలుతీరు పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ పలుమార్లు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ శ్రీజ సమీక్షించారు. మండలాల వారీగా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలును అడిగి తెలుసుకున్నారు. ఓ జిల్లా స్థాయి అధికారి తాను పాఠశాలలకు వెళ్లలేదని, ఈ కార్యక్రమంపై అవగాహన లేదని సమాధానమిచ్చారు. ఆయన విద్యాశాఖకు చెందిన అధికారి కావటం గమనార్హం.

## వాళ్లు కోట్లు కొట్టేశారు.. వీళ్లు చేతులు కట్టేసుకున్నారు!

అశ్వారావుపేట, : మోసాల్లో ఆరితేరారు.. రెండింతల నగదంటూ అత్యాశ చూపి ప్రజలను నట్టేట ముంచారు. కొన్ని నెలలుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నారు. జనం డబ్బుతో విలాసాలు అనుభవిస్తున్నారు. జరిగిన మోసాన్ని చెప్పుకొంటే పరువుపోతుందని బాధితులు మిన్నకుంటుంటే, నిందితులను పట్టుకోవటంలో పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## లారీని ఢీకొన్న టిప్పర్

ములుగు, : లారీని వెనుక నుంచి టిప్పర్ ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. ములుగు సమీపంలోని మెడికల్ కాలేజీ చేరువలో జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ ఉప్పలయ్యను స్థానికులు బయటకు తీసి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

## ఎంజీఎంలో కీలక బాధ్యతలు ప్రైవేటు వ్యక్తికి..!

జనగామ, : ఎంజీఎం ఆసుపత్రిలో అత్యంత కీలకమైన ఎంఆర్‌డీ(మెడికల్ రికార్డు డిపార్ట్‌మెంట్) లీగల్ కేసులకు సంబంధించిన విభాగంలోని సెక్షన్ క్లర్క్ విధులు ఓ ప్రైవేటు వ్యక్తి నిర్వహిస్తుండగా.. కోర్టు కానిస్టేబుళ్లు ఎంజీఎం ఆసుపత్రి ఆర్ఎంవోకు ఫిర్యాదు చేశారు. ఆరు నెలలుగా ఎంఎల్‌సీ సెక్షన్ ఉద్యోగి హైదరాబాద్ నుంచి వస్తూ.. పోతున్నారు. విధులకు సక్రమంగా రాకపోవడంతో గతంలో పలుమార్లు కోర్టు కానిస్టేబుళ్లు సూపరింటెండెంట్కు, ఆర్ఎంవోలకు ఫిర్యాదు చేశారు. 20 రోజులుగా సదరు ఉద్యోగి విధులకు రాకుండా తన స్థానంలో ఓ ప్రైవేటు వ్యక్తిని అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు. అతడికి కీలకమైన మెడికల్ లీగల్ కేసుల సర్టిఫికెట్ల(ఎంఎల్‌సీ)ను అప్పగించారు.

## పొగ మంచు.. ప్రాణం హరించు

మహబూబాబాద్, : శీతాకాలంలో మంచు తెరలు దారులను కప్పేస్తున్నాయి. ప్రకృతి రమణీయత ఎలా ఉన్నా హిమం కురిసే సమయంలో దారి కానరాక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఉదయం పూట వాహనాలు నడిపే వారు, రోడ్డుపై నడిచే వారు అప్రమత్తంగా లేకుంటే విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ఈ సమయంలోనే ఎక్కువగా ప్రాణ నష్టం ఉంటోందని పోలీసు రికార్డులు పేర్కొంటున్నాయి. మంచు ఎక్కువగా కురుస్తున్న సమయంలో వాహనదారులు పలు నిబంధనలను పాటిస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి అప్రమత్తతతో ప్రమాదాల బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటే మేలంటున్నారు.

## ఇళ్లు ఇచ్చారు.. వసతులు మరిచారు!

భూపాలపల్లి, : గూడు లేని నిరుపేదలకు ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లు నిర్మించింది. రెండేళ్ల క్రితం లబ్ధిదారులకు పంపిణీ చేసింది. కనీస వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులే స్వచ్ఛందంగా సమకూర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందిస్తేనే కాలనీవాసుల సమస్యలు తీరనున్నాయి.

## ప్రగతి ధర్మారం గ్రామంలో చోరీ

సంగారెడ్డి, : మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో గత రాత్రి దొంగలు మహేశ్వరి బిన్నీ రైస్ మిల్లులో చోరీకి పాల్పడ్డారు. దొంగలు మిల్లు వెనుక భాగంలో రేకులను తొలగించి లోపలికి ప్రవేశించి, రెండు మోటార్లను ధ్వంసం చేసి, వాటిలోని కాపర్ వైర్లను, రెండు బస్తాల బియ్యాన్ని, ఇన్వేటర్ బ్యాటరీని ఎత్తుకెళ్లినట్లు బాధితులు మంగళవారం తెలిపారు.

## రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం కలకలం

ఆందోల్, : మెదక్ జిల్లా తూప్రాన్ గేట్ సమీపంలోని బ్రాహ్మణపల్లి రైల్వే ట్రాక్‌పై ఒక వ్యక్తి మృతదేహం కనిపించింది. ఉదయం రైల్వే ప్రయాణికులు మృతదేహాన్ని గుర్తించి గ్రామస్తులకు, అధికారులకు సమాచారం అందించారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలనలు చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

## సీసీఐ పత్తి రైతుల పట్ల పిచ్చిపిచ్చి నిర్ణయాలు మానుకోవాలి



నారాయణఖేడ్, : సీసీఐ పత్తి కొనుగోళ్లలో రైతుల పట్ల పిచ్చిపిచ్చి నిర్ణయాలు మానుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మంగళవారం డిమాండ్ చేశారు. ఎకరానికి కేవలం 7 క్వింటాళ్ల పరిమితి అధిక దిగుబడులు సాధించిన రైతులకు నష్టం కలిగిస్తుందని, పత్తిలో తేమ శాతం 20 వరకు ఉన్నా కొనుగోలు చేయాలని ఆయన కోరారు. రైతులకు హాని కలిగించే నిబంధనలను ఎత్తివేయాలని ఎమ్మెల్యే ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

## రైస్ మిల్లులోకి చొరబడిన దుండగులు.. మోటార్లు చోరీ

జహీరాబాద్, : మండల పరిధిలోని ప్రగతి ధర్మారంలో గుర్తుతెలియని వ్యక్తులు రైస్ మిల్లులో చోరీకి పాల్పడ్డారు. రాత్రి ఈ ఘటన జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని మహేశ్వరి రైస్ మిల్లులో వెనుక భాగంలోని షెటర్లు పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు మిల్లులోకి చొరబడ్డారు. మోటార్లు రెండు పగలగొట్టి అందులోని కాపర్ వైరుతోపాటు ఇన్వర్టర్ బ్యాటరీ, విద్యుత్ ఎర్త్ పట్టీలు దొంగిలించారు. బియ్యం బస్తాలు కూడా ఎత్తుకెళ్లారు. మంగళవారం మిల్లుకి వెళ్లిన కార్మికులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి యజమాని దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో మిల్లు యజమాని శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్సై అరవింద్ పరిశీలించి వివరాలు సేకరించారు.

## గ్యాస్ సిలిండర్ పేలి.. ఆరుగురికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు, : గ్యాస్ సిలిండర్ పేలి ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా, ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శెట్టె భాస్కర్ ఇంట్లో వంట గ్యాస్ లీకై ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలింది. క్షణాల్లోనే మంటలు వ్యాపించగా ఇంట్లో ఉన్న భాస్కర్, తండ్రి అయ్యల్లం, భార్య కావ్య, కుమార్తెలు ప్రణవి, కృతిక, హర్షిణిలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. స్థానికులు మంటలు అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ఆసుపత్రికి తీసుకెళ్లారు.

## ప్రతి డ్రైవర్‌కు పక్కాగా బ్రీత్ ఎనలైజర్

సిద్దిపేట, : మద్యం తాగి వాహనాలు నడపొద్దని రోజూ పోలీసులు బ్రీత్ ఎనలైజర్ ద్వారా తనిఖీలు చేస్తున్నారు. అందుకు భిన్నంగా సిద్దిపేట పట్టణంలోని డిపో వద్దకు వచ్చిన డ్రైవర్లందరికీ మేనేజర్ భవభూతి ఆధ్వర్యంలో ఆర్టీసీ సిబ్బంది రోజూ బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేసి విధులకు పంపిస్తారు. బస్సుల ద్వారా ప్రయాణికులు సురక్షితంగా గమ్యం చేరేలా ఈ చర్యలు తీసుకున్నట్లు మేనేజర్ తెలిపారు.

## లీజు మిల్లర్ల ఒప్పందాల్లో అక్రమాలు

దేవరకద్ర,: మిల్లులు లీజుకు తీసుకున్న ట్రేడర్లు అవకతవకలకు పాల్పడుతున్నారు. మిల్లర్లకు ధాన్యం కేటాయించే ఒప్పంద (అగ్రిమెంట్) పత్రంలో యజమాని సంతకం అవసరం. అతను సంతకం చేయాల్సిన స్థానంలో లీజు ట్రేడర్ ఫోర్జరీ సంతకాలు చేస్తున్నారు. కొత్త ఒప్పందం ప్రకారం లీజు ట్రేడర్ ఇచ్చే అగ్రిమెంట్‌లో డీఎం, డీఎస్‌వోల ఎదురుగా మిల్లు యజమాని సంతకం చేయాలి. లీజు ట్రేడర్‌కు ఇద్దరు సొంత మిల్లర్లు జామీను ఇవ్వాల్సి ఉండగా లీజు ట్రేడర్లే ఒకరినొకరు జామీను ఇచ్చుకుంటున్నారు. ఒక్కో మిల్లుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు మాత్రమే గ్యారంటీ ఇస్తున్నారు. మిల్లర్ల ముడుపులతో అధికారులు ఈ నిబంధనను పట్టించుకోవడం లేదు.

## నిందితులను శిక్షించాలని కుటుంబీకుల నిరసన



కల్వకుర్తి, : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం రాచూర్ గ్రామానికి చెందిన కొంగళ్ల శివ(26)ని హత్య చేసిన దుండగులను అరెస్టు చేసేంత వరకు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లే ప్రసక్తే లేదని కుటుంబీకులు కల్వకుర్తి ఠాణాలో నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 15న తన భార్య మౌనికను పొలంలో దించి పనిమీద వెళ్లిన శివ ఈనెల 16న ఉదయం గ్రామ సమీపంలో అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన విషయం విదితమే. ఘటనపై సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై కురుమూర్తి డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంలను రప్పించి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి రాత్రి పోస్టుమార్టం నిర్వహించారు. కానీ సాయంత్రం వరకు మృతదేహాన్ని తీసుకెళ్లకుండా అక్కడే ఉంచారు. హత్య చేసి విద్యుదాఘాతంగా చిత్రీకరిస్తున్నారని, నిందితులను పట్టుకునేంత వరకు ఇంటికి తీసుకెళ్లే ప్రసక్తి లేదని మొండికేశారు. మరోసారి సీఐ, ఎస్సైలు హామీ ఇవ్వడంతో సాయంత్రం 4గంటలకు ఇంటికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

## పురుగు మందు తాగి యువకుడి బలవన్మరణం

హుజూర్‌నగర్,: పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్గొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టల బుచ్చయ్య, రాములమ్మ దంపతుల చిన్న కుమారుడు సురేందర్ (28) ఫైనాన్స్ సహకారంతో ట్రాలీ ఆటో తీసుకోని కుటుంబ పోషణకు చేదోడు వాదోడుగా నిలిచేవాడు. దీనికితోడు ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశాడు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా కురిసిన వర్షాలతో పత్తి పంట దెబ్బతింది. అంతేకాకుండా ఫైనాన్స్ తీసుకున్న ఆటో కిస్తీలు సైతం చెల్లించకపోవడంతో మనోవేదనకు గురైన ఆ యువకుడు ఆదివారం రాత్రి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పురుగు మందు తాగి బలవన్మరణానికి యత్నించాడు.

## డివైడర్‌ను ఢీకొన్న బైక్..
## ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డి, : ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామ శివారు 44వ జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. భూమీపల్లి గ్రామానికి చెందిన కమ్మరి నవీన్, సౌందర్య ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి డివైడర్‌ని ఢీకొట్టారు. ఈ ఘటనలో నవీన్, సౌందర్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సదాశివనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి నిలకడగా ఉందని ఎస్సై పుష్ప రాజు తెలిపారు.

## ఆసుపత్రికి ఆలస్యం జబ్బు

కామారెడ్డి, : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిస్థితి తయారైంది. భవన మరమ్మతులు, నూతన పైప్‌లైన్‌కు నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. ఏడంతస్తుల జీజీహెచ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలల పైపులు పగిలాయి. లీకైన నీరు గోడల మీదుగా పారుతోంది. ఈ నేపథ్యంలో మరమ్మతులకు ప్రభుత్వం రూ.2.75 కోట్లను 3 నెలల క్రితం మంజూరు చేసింది.

## వాగులో పడిన కారు.. యువకుడి దుర్మరణం

జుక్కల్, : ప్రమాదవశాత్తు కారు వాగులో పడి యువకుడు మృతిచెందిన ఘటన డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్పల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన గుండ బాలచందర్(23) డీజే నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన యువకుడు ఎంతకీ తిరిగి రాలేదు. ఉదయం కోరట్‌పల్లి-మైలారం గ్రామాల మధ్య ఉన్న వాగులో కారు పైకి తేలడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు జేసీబీ సాయంతో వాగులోని కారును బయటికి తీశారు. అందులో మృతిచెందిన వ్యక్తి బాలచందర్‌గా గుర్తించారు.

## ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



బాన్సువాడ, : మాక్లూర్ మండలం చిన్నాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మండల ప్రత్యేకాధికారి రోహిత్ రెడ్డి, ఎంపిడివో బ్రహ్మానందరెడ్డి మంగళవారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి నిర్మాణ పనులను తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి, ఇబ్బందులుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు.

## డిఈవో సుశీంద్ర రావ్ పాఠశాల తనిఖీ



చేవెళ్ల, : రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) సుశీంద్ర రావ్, స్థానిక ఏంఈవో మనోహర్‌తో కలిసి మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను, ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులకు బోధిస్తున్న అంశాలను పరిశీలించారు. విద్యార్థులు ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో చదివి విజయం సాధించాలని, 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## మారక ద్రవ్యాలపై ప్రతిజ్ఞ, అవగాహనా సదస్సు

మహేశ్వరం, : మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రతీ ఒక్కరూ ఉద్యమంలా కదిలి రావాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశం సూచించారు. మంగళవారం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎస్. వెంకటేశం ఆధ్వర్యంలో పురపాలక సిబ్బంది, మహిళా సంఘాల సభ్యుల చేత 'మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ - 2025' నిర్వహించబడింది. ఈ ప్రతిజ్ఞ ద్వారా మాదకద్రవ్యాల నిరోధానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## షాద్ నగర్ లో సిపిఎం, ఎస్ఎఫ్ఐల ఆందోళన

షాద్‌నగర్, : దళితుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణ పేరుతో ప్రభుత్వం ఉన్నప్పటికీ, వాటి అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య విమర్శించారు. ఎల్లంపల్లి గ్రామానికి చెందిన దళితుడు ఎర్ర రాజశేఖర్ కుల దురహంకార హత్యకు గురికావడమే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం షాద్ నగర్ పట్టణ చౌరస్తాలో స్థానిక సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో యాదయ్య పాల్గొని, ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మహేశ్వరం, : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కందుకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొక వ్యక్తికి గాయాలు అయ్యాయి. కేషంపేట మండలం బైరఖాన్ పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి నారాయణ (50) తన మోటార్ సైకిల్ పై కందుకూర్ నుండి బైరఖాన్ పల్లి గ్రామానికి వెళుతుండగా, జైత్వారం గ్రామం దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న క్రెక్ స్కూల్ బస్సు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా బస్సును నడుపుకుంటూ వచ్చి బైక్ ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ నడిపిన కుమ్మరి నారాయణ తలకు, కాళ్ళకు, చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

# అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం : కమిషనర్ వెంకటగోపాల్

**ఐజీఆర్ఎస్ ద్వారా వచ్చిన 38 కోట్లను దశలవారీ అభివృద్ధి పనులకు వినియోగం**

**గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదు**

**సామాన్య ప్రజలను తమ పనులను చేయకుండా ఇబ్బంది పెడితే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం**

**జీ ప్లస్ 2 అనుమతి తీసుకుని అదనపు అంతస్తులు వేసి**

**వాణిజ్య వ్యాపారాలు చేస్తున్న వారి వివరాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాను**

**అగ్నిమాపక శాఖ అధికారుల అనుమతి లేని భవనాలపై**

**చర్యలు తీసుకుంటాం : కమిషనర్ ఆర్. వెంకట గోపాల్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో అక్రమ నిర్మాణాలను ఈపాటికే చట్టపరంగా నోటీసులు అందజేయడం జరిగిందని కమిషనర్ ఆర్.వెంకటగోపాల్ అన్నారు. గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం మరింత అభివృద్ధి సాధించే దిశగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఈ క్రమంలోనే అయోధ్య చౌరస్తా నుంచి కొంపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులను త్వరలో చేపట్టే విధంగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో సహజ వనరులు, వాతావరణ కాలుష్యం లేకుండా ఎస్టిపిలను ఏర్పాటు చేసి మురుగు కాలువలను సకాలంలో నిర్మాణం చేపడుతూ అవసరమైన చోట సీసీ రోడ్లు నిర్మాణం కొనసాగిస్తామని తెలిపారు. అదేవిధంగా పురపాలక సంఘం పరిధిలో గ్రామ ప్రజలు సిటిజన్ చార్ట్ ప్రకారం అందరికీ సేవలు అందిస్తామని ప్రత్యేకంగా ప్రజలకు అత్యవసర సమయంలో సైతం అందుబాటులో ఉంటూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో టాక్స్ ల రూపంలో రావలసిన నిధులు రూ.16 కోట్ల 13 లక్షలు ఉండగా బకాయిల రూపంలో మరికొంత సొమ్ము అదనంగా ఉన్నట్టు తెలిపారు. టాక్స్ ల రూపంలో 49 శాతం వసూలు చేశామని తద్వారా వచ్చిన ఆదాయాన్ని జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో బాలుర వసతి గృహాలు, బాలికల వసతి గృహాలు అధిక సంఖ్యలో ఉన్నాయని ఆ వసతి గృహాల యజమానులు తమ బాధ్యతగా విద్యార్థిని, విద్యార్థుల పూర్తి జాబితాను తయారు చేసుకుంటూ వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, అనుమానవస్పదంగా ఉన్న విద్యార్థుల వివరాలు వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని మరీ శృతిమించితే పోలీసులకు సైతం సమాచారం ఇవ్వాలని తెలిపారు. జీ ప్లస్ 2 భవన అనుమతులు తీసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మించి వాణిజ్య, వ్యాపారాలు నిర్వహిస్తున్న భవన యజమానుల వివరాలు సేకరించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని, సదరు భవన నిర్మాణాలకు అగ్నిమాపక శాఖ అనుమతులు ఉండాలని తెలిపారు. అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు లేని భవనాలపై సైతం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో కొంతమంది మాజీ ప్రజాప్రతినిధులు ఇప్పటికీ తామే ప్రజాప్రతినిధులమని కొనసాగుతూ ఇష్టరీతిన వ్యవహారాలు చక్కబట్టేలా చూస్తున్నారని దానికి పురపాలక సంఘం అధికారులు సైతం తలొగ్గేలా ఒత్తిడి పెంచుతున్నారని ఒత్తిడి పెంచినంత మాత్రాన సిటిజన్ చార్ట్ నిబంధనల మేరకే పనులు చేస్తామని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి




తాండూరు,: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తాండూరు పట్టణం శివాజీ చౌక్ మార్గంలోని ఓ వైన్స్ సిట్టింగ్ గదిలో చోటు చేసుకుంది. మృతుడి నుదుటిపై బలమైన గాయం ఉండడంతో హత్య చేశారని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. తాండూరు మండలం అంతారం తండాకు చెందిన రాములు (58) మద్యం సిట్టింగ్ గదిలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే ఉదయం 7 గంటలకు పనికి వెళ్లాడు. అయితే కాసేపటికే రోడ్డుపై విగతజీవిగా పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

వికారాబాద్, : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించే దిశగా "మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ - 2025" కార్యక్రమం మంగళవారం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల వల్ల సొసైటీకి కలిగే హానికర ప్రభావాలపై అవగాహన పెంపొందిస్తూ, వాటి నిర్మూలన కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు రావాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ ఎస్. వెంకటేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పురపాలక సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అడ్డగోలుగా తవ్వకాలు.. భవనానికి బీటలు

గోషామహల్, : ఇంటి నిర్మాణం కోసం తవ్వకాలు చేపడుతుండగా పక్కనే ఉన్న బహుళ అంతస్తుల భవనానికి బీటలు వారడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మధ్యాహ్నం గోషామహల్ చాక్నావాడీలో సుమారు ఎనభై గజాల స్థలంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణంలో భాగంగా పునాదుల కోసం తవ్వుతుండగా పక్కనే ఉన్న బహుళ అంతస్తుల భవనం కుదుపునకు గురై బీటలు వారింది. దీంతో ఆ ఇంట్లోని వారు భయంతో పరుగులు తీశారు. మరోవైపు ఉన్న ఇంకో బహుళ అంతస్తుల భవనం ఇంటి యజమానులు భయంతో ఇల్లు వదిలి బయటకు వెళ్లిపోయారు.

## రహదారి అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి: ఎంపీ

మేడ్చల్, : బోయిన్‌పల్లి నుంచి కాలకల్ వరకు చేపడుతున్న 44వ జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అధికారులకు సూచించారు. ఆయన కొంపల్లిలో జాతీయ రహదారి పనులను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. రోడ్డు పనులు ప్రారంభమై మూడేళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తికాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

## జర్మన్ కాస్మొటిక్ బ్రాండ్ 'ఎసెన్స్'ను భారత్‌కు తీసుకొస్తున్న రిలయన్స్

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన రిటైల్ విభాగం దేశంలో వేగంగా పెరుగుతున్న బ్యూటీ వ్యాపారంపై దృష్టి సారించింది. అందులో భాగంగా యూరప్‌లోని ప్రముఖ కాస్మొటిక్స్ బ్రాండ్ 'ఎసెన్స్'ను భారత మార్కెట్‌కు తీసుకువస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ఇది దేశంలో పెరుగుతున్న బ్యూటీ వ్యాపారంలో రాణించేందుకు సహాయపడుతుంది. ఈ మేరకు జర్మనీకి చెందిన గ్లోబల్ కాస్మొటిక్స్ కంపెనీ కాస్నోవా బ్యూటీతో ప్రత్యేక భాగస్వామ్యం కుదుర్చుకున్నామని రిలయన్స్ రిటైల్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సహకారం రిలయన్స్ రిటైల్ బ్యూటీ పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేస్తుంది. దేశవ్యాప్తంగా వినియోగదారులకు అధిక నాణ్యత, సరసమైన, హానికరంకాని ఎసెన్స్ బ్యూటీ ఉత్పత్తులను అందిస్తామని కంపెనీ వెల్లడించింది. ఎసెన్స్ ఉత్పత్తులు రిలయన్స్ రిటైల్ ఇంటిగ్రేటెడ్ ఓమ్నిఛానల్ ఎకోసిస్టమ్ ద్వారా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, బ్యూటీ స్టోర్‌లు, భాగస్వామ్య రిటైల్ ఫార్మాట్‌లలో లభిస్తాయి. అధికారిక పంపిణీదారుగా రిలయన్స్ రిటైల్ దేశవ్యాప్తంగా వీటిని అందుబాటులో ఉంచుతుందని పేర్కొంది.

## అక్టోబర్‌లో 200 శాతం పెరిగిన బంగారం దిగుమతులు

ఈ ఏడాది దీపావళి సహా పండుగ సీజన్ బంగారం గిరాకీ ఎక్కువగా ఉండటం, అధిక ధరల కారణంగా అక్టోబర్ నెలలో పసిడి దిగుమతులు ఏకంగా 200 శాతం పెరిగాయని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి.ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతుండటంతో ధరలు అధికంగానే ఉన్నాయని, ఫలితంగా డిమాండ్ నెమ్మదించే అవకాశాలు ఉన్నట్టు ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. వెండి దిగుమతులు గణనీయంగానే పెరిగాయని, ఈ రెండు విలువైన లోహాల దిగుమతుల కారణంగా అక్టోబర్ నెలలో దేశ వాణిజ్య లోటు అత్యధికంగా 41.68 బిలియన్ డాలర్ల(రూ. 3.7 లక్షల కోట్ల)కు చేరింది. ఈ మేరకు సోమవారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల్లో పేర్కొంది.గత నెలలో దేశీయంగా బంగారం దిగుమతులు 14.72 బిలియన్ డాలర్లు(రూ. 1.30 లక్షల కోట్లు)గా నమోదయ్యాయి. 2024, అక్టోబర్‌లో ఇవి కేవలం రూ. 43.6 వేల కోట్ల దిగుమతులు మాత్రమే జరిగాయి. వెండి దిగుమతులు కూడా రూ. 3,810 కోట్ల నుంచి ఈ ఏడాది అక్టోబర్‌లో రూ. 24 వేల కోట్లకు పైగా పెరిగాయి. ఇక, మొత్తం దేశ ఎగుమతులకు సంబంధించి గత నెలలో 11.8 శాతం తగ్గి 34.38 బిలియన్ డాలర్ల(రూ. 3.04 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. అయితే, దిగుమతులు 16.63 శాతం పెరిగి 76.06 బిలియన్ డాలర్ల(రూ. 6.74 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. దీంతో వాణిజ్య లోటు 41.68 బిలియన్ డాలర్ల(రూ. 3.7 లక్షల కోట్ల)కు పెరిగింది. వాణిజ్య లోటు పెరగడానికి బంగారం, వెండి దిగుమతులు అధికంగా జరగడమ్మని అధికారులు పేర్కొన్నారు.

## మరోసారి ఇన్ఫో నారాయణ నోట.. 72 గంటల పని మాట

ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ ఆర్ నారాయణ మూర్తి మరోసారి 72 గంటల పని విధానంపై మాట్లాడారు. అయితే, ఈసారి చైనాను ఉదాహరణగా పేర్కొనడంపై వివాదం పెరుగుతోంది. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. చైనాలో అనుసరించే '9-9-6 రూల్' ని ప్రస్తావించారు. 'వర్క్-లైఫ్ బ్యాలెన్స్ గురించి ఆందోళన చెందే ముందు, ప్రజలు మొదట తమ జీవితాన్ని ఆస్వాదించడంపై దృష్టి పెట్టాలి. తన అనుభవంలో విజయానికి దోహదపడేది కష్టపడి పనిచేయడమేనని, అలా కాకుండా ఏ వ్యక్తి, సమాజం, ఏ దేశం కూడా ముందుకెళ్లలేదు. గతేడాది తమ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీకి చెందిన సీనియర్ అధికారులు చైనాకు వెళ్లారు. సాధారణ చైనా ప్రజల జీవితాన్ని దగ్గరగా చూసేందుకు వారు చిన్న పట్టణంలోని హోటల్‌లో బస చేశారు. అక్కడొక సామెత ఉంది. 9-9-6 అని చెబుతారు. దీనర్థం.. ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు, వారానికి 6 రోజులు అంటే వారానికి 72 గంటలు పనిచేస్తారట అని నారాయణ మూర్తి వివరించారు. మనదేశ ప్రధాని నరేంద్ర మోడీ వారానికి 100 గంటలు పనిచేస్తారు. ఇతరులకు అవకాశాలు అందించేందుకు, కష్టపడి-తెలివిగా పనిచేసేందుకు ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు. అయితే, ఆయన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో మరోసారి తీవ్రమైన చర్చ జరుగుతోంది. నారయాణ మూర్తి వ్యాఖ్యలు విమర్శిస్తూ చాలామంది పోస్టులు పెడుతున్నారు. దేశంలోని చాలామంది తక్కువ మౌలిక సదుపాయాలు, ఎక్కువ ఖర్చులతో జీవితున్నారని ఒకరు స్పందించారు. మరొకరు, చైనా స్థాయిలో జీతాలు, మౌలిక సదుపాయాలు, జీవన వ్యయం ఇచ్చిన తర్వాత పని గంటలపై మాట్లాడాలని అన్నారు.

## సీజేఐపై దాడి దారుణం



న్యూఢిల్లీ: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) బి.ఆర్ గవాయ్‌పై జరిగిన దాడిపై ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. అది దేశంలోని 30 కోట్ల మంది దళిత ప్రజలపై జరిగిన దాడేనని అన్నారు. దళితులపై దాడులకు పాల్పడే వారికి చట్టాలు వర్తించకపోవడం అత్యంత దారుణమని విమర్శించారు. సీజేఐ బి.ఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం జంతర్ మంతర్ వద్ద దళితుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులే అని రాజ్యాంగం చెబుతుందనీ, అయితే అందుకు విరుద్ధంగా దళితుల మీద దాడులకు పాల్పడుతున్నవారిపై చట్టపరమైన వ్యవస్థలు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ధర్మం, విశ్వాసాల ముసుగులో దాడులకు పాల్పడే వారికి చట్టాలు వర్తించవా? వారిపై చర్యలు తీసుకోరా? అని ప్రశ్నించారు. న్యాయ, ఢిల్లీ పోలీసు వ్యవస్థ, జాతీయ మానవ హక్కుల కమిషన్ తమ కర్తవ్యాలను అమలు చేయడంలో పూర్తి వివక్షతను చూపెట్టాయని అన్నారు. ఎన్నో సంఘటనలపై పత్రికల్లో వచ్చిన వార్తలను ఆధారంగా చేసుకొని సుమోటోగా కేసులు తీసుకున్న వ్యవస్థలు.. దేశంలోనే అత్యున్నత న్యాయస్థానం అధిపతి అయిన జస్టిస్ బి.ఆర్ గవాయ్‌పై దాడి జరిగితే ఎందుకు మౌనం వహించాయని ప్రశ్నించారు. ఘటన జరిగి నెల గడిచినా కనీసం చట్టపరంగా ఒక్క చర్య కూడా ఎందుకు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వివక్షతను చూపుతున్న చర్య, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధమైన చర్య అని అన్నారు. దళితుల మీద దాడులకు పాల్పడితే సహించే రోజులు పోయాయని తెలిపారు. ధర్మం, విశ్వాసాల ముసుగులో దాడులకు పాల్పడే వారికి తగిన గుణపాఠం నేర్పుతామని హెచ్చరించారు. తమ పోరాటం దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకో వడానికి, న్యాయ వ్యవస్థ స్వతంత్రను కాపాడుకో వడానికి, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికే జరుగుతుందని అన్నారు. రాజ్యాంగంతోనే దళితు లకు మానవ హక్కులు లభించి, మనుషులుగా గుర్తింపు పొందారని వివరించారు. దళితులు ఉన్నత స్థాయికి ఎదగడానికి రాజ్యాంగమే కారణమని, దళితులు ఇలా ఉన్నత స్థాయికి ఎదగడాన్ని కొంత మంది జీర్ణించు కోలేకపో తున్నారని అన్నారు.

## ఇటీవలే మరణించిన వెల్మకన్న రాములు కుటుంబ సభ్యులను పరామర్శించిన

**ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామంలో ఇటీవలే హార్ట్ ఎటాక్ తో మరణించిన గ్రామపంచాయతీ వాటర్ మ్యాన్ వెల్మకన్న రాములు కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించిన నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుండి కిష్టాపూర్ గ్రామానికి ఎన్నో సేవలు చేసినటువంటి రాములు మన మధ్యలో లేక పోయినందుకు చాలా బాధగా ఉందని ఇలాంటి మంచి వ్యక్తిని కోల్పోయినందుకు వారి కుటుంబానికి పెద్దదిక్కు అయినటువంటి వెల్మకన్నె రాములు హార్ట్ ఎటాక్ తో మరణించడం దురదృష్టకరమని వెల్మకన్న రాములు కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికపరంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరిన నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి ఎమ్మెల్యే వెంట కిష్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ తిరునగరి గోదావరి వెంకటరాములు, కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు , బిఆర్ఎస్ పార్టీ జిల్లా యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి, రంగంపేట పిఎసిఎస్ చైర్మన్ అరిగే రమేష్, కిష్టాపూర్ బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు వరిగుంతం నాగరాజు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, పెద్దట్ల మల్లేశం, యూసుఫ్, దుర్గయ్య, నారాయణ, నిర్మల, అనురాధ, గ్రామపంచాయతీ సిబ్బంది అరికెల బాలకృష్ణ, రాజు, తదితరులు ఉన్నారు.

# అసైన్మెంట్ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు

**ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు**
**పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ భూములు**
**భవిష్యత్తు అవసరాల కోసమే పరిరక్షణ**
**భూముల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**
**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**







అమీన్పూర్ (ప్రశ్న న్యూస్) శరవేగంగా విస్తరిస్తున్న పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రజల భవిష్యత్తు అవసరాల కోసం ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములు కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోబోతున్నట్లు స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. భూముల పరిరక్షణకు ప్రజలందరూ సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట రెయిన్బో మెడోస్ కాలనీలో ప్రభుత్వ భూమి వివాదంపై ఎమ్మార్వో వెంకటేశం, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కృష్ణ లతో కలిసి ఆయన మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, రెవెన్యూ అధికారులు, గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, డెవలపర్స్ తో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్న లక్ష్యంతో ఇళ్లను కొలుగోలు చేసిన కాలనీ వాసులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వమని హామీ ఇచ్చారు. అందరి సమక్షంలో మరోమారు జాయింట్ సర్వే నిర్వహించి పూర్తి న్యాయం చేస్తామని తెలిపారు.

రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామస్థాయి నుండి ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూముల వివరాలను సేకరించి.. కబ్జాలకు గురికాకుండా పూర్తిస్థాయి రక్షణ ఏర్పాట్లు చేయబోతున్నట్లు తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ పార్కులు, రహదారులను కబ్జా చేసి.. డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తూ కొనుగోలుదారులను మోసం చేస్తే చట్టరీత్య కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని సూచించారు.

గజం భూమి కబ్జాకు గురైన కబ్జాదారులు జైలు ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కొన్ని మండలాల పరిధిలో ప్రభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పడానికి ప్రభుత్వ భూములు దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ ఫంక్షన్ హాల్లు, విద్యాసంస్థలు, సబ్ స్టేషన్లు, గోదాముల, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను వినియోగించబోతున్నట్లు తెలిపారు.

## వైద్య విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

**- అత్యంత నాణ్యత ప్రమాణాలతో**
**క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణం తుది దశకు**
**- ప్రసూతి మరియు శిశు వైద్య విభాగాలను**
**బలోపేతం చేసే దిశగా చర్యలు**
**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ మండలంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ మెడికల్ కళాశాల, నిర్మాణం పూర్తి దశలో ఉన్న క్రిటికల్ కేర్ సెంటర్, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్య విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, అత్యంత నాణ్యత ప్రమాణాలతో క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణం చివరి దశలో ఉందని, ప్రసూతి, శిశు వైద్య విభాగాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.మెదక్ పట్టణ పిల్లికోట్టాల్. మెడికల్ కళాశాల ,క్రిటికల్ కేర్ సెంటర్, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని మంగళ వారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు.ముందుగా మెడికల్ కళాశాలలో తరగతి గదులు,ల్యాబులు, డెమోరూమ్లు ,లైబ్రరీ లను పరిశీలించారు. విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మొదటి సం: లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.మెడికల్ విద్యార్థులు ర్యాగింగ్ కు దూరంగా ఉండాలని,ర్యాగింగ్ చట్టాలు కఠినంగా ఉన్నాయని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా,అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఈ నెలలోనే రెండవ సంబీ విద్యార్థులకు తరగతులు ప్రారంభం కావడం తో వారికి హాస్టల్ సదుపాయం, ప్రశాంత వాతావరణం లో తరగతులు,ప్రాక్టికల్స్, డెమో లు నిర్వహించి ఉన్నత వైద్య విద్యార్థులు గా తీర్చి దిద్దాలన్నారు.మెడికల్ కళాశాల లో ఏవైనా పెండింగ్ పనులుంటే వెంటనే పరిష్కరించలని అధికారులను ఆదేశించారు.నిర్మాణం చివరి దశలో ఉన్న క్రిటికల్ కేర్ సెంటర్ ను పరిశీలించారు. తొందరలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.మాతా శిశు కేంద్రంలో రోగులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలో అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి శ్రీరామ్ ,ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నితిన్ కాబ్రా, సూపర్డెంట్ సునీత, డి సి హెచ్ ఎస్ శివ దయాల్, వివిధ,ప్రొఫెసర్లు,, ఆరోగ్య శాఖా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నషా ముక్త్ భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**నషా ముక్త్ భారత్ కార్యక్రమనికి ఐదు సంవత్సరాలు పూర్తి**
**మెదక్ అదనపు ఎస్పీ మహేందర్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు రావాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ శ్రీ ఎస్. మహేందర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ సిబ్బంది మరియు అధికారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, అక్రమ విక్రయం వంటి కార్యకలాపాలు యువత భవిష్యత్తును దెబ్బతీసే తీవ్రమైన సమస్యలు అని పేర్కొంటూ, వాటిని అరికట్టడానికి పోలీసులు మరియు ప్రజలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు.కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ సిబ్బందితో అదనపు ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉంటానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తానని, సమాజంలో ఎవ్వరూ మాదకద్రవ్యాల బారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం అంకితభావంతో పనిచేస్తానని వాళ్లందరూ ప్రమాణం చేశారు. మాదకద్రవ్యాల ప్రభావం వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందని, అందుకే పోలీస్ వ్యవస్థతో పాటు ప్రతి పౌరుడు అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని ఆయన అన్నారు. భారతదేశం అభివృద్ధి బాటలో ముందుకు సాగాలంటే యువతను డ్రగ్స్ ముప్పు నుండి రక్షించడం మొదటి అడుగు అని అదనపు ఎస్పీ స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలపై పోరాటం ఒక సామూహిక బాధ్యతగా తీసుకొని, కుటుంబాలు-విద్యాసంస్థలు-సమాజం కలిసి అవగాహన పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డియస్పి శ్రీ. సుభాష్ చంద్ర బోస్ ఏఆర్ డియస్పి శ్రీ. రంగా నాయక్ మరియు ఏఓ శ్రీమతి మని మరియు ఆర్ఐ శైలందర్ మరియు ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీ. సందీప్ రెడ్డి మరియు dcrbఇన్స్పెక్టర్ శ్రీ. కృష్ణ మూర్తి ఎసైలు సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో నాణ్యత పెంచాలి

**- వైద్య పరికరాలను పూర్తి స్థాయిలో వినియోగించాలి**
**- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి : బండి సంజయ్ కుమార్**
**- సీఎస్ఆర్ కింద వేములవాడ ఏరియా ఆసుపత్రికి రూ.1.80 కోట్లు విలువైన పరికరాలు అందజేత - ప్రారంభం**





వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా అందించిన రూ. కోటి 80 లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలను కేంద్రమంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, ఇంచార్జి జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ప్రారంభోత్సవం అనంతరం మంత్రి ఆసుపత్రిలోని విభాగాలను పరిశీలించి, కొత్త పరికరాల వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరికరాలను పూర్తిస్థాయిలో ఉపయోగించి రోగులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ప్రజలు ప్రభుత్వ దవాఖాన సేవలను నమ్మకంగా ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేయాలనే దిశగా అధికారులకు సూచనలు జారీ చేశారు.సీఎస్ఆర్ కింద ఆసుపత్రికి ఈసీజీ మిషన్లు, మల్టీ మానిటర్లు, డైథర్మీ యూనిట్, ఓటి లైట్, అనస్థీషియా వర్క్ స్టేషన్, ఫెటల్ మానిటర్, ఈఎన్టీ సర్జికల్ మైక్రో స్కోప్, మార్చురీ క్యాబినెట్ (4 బాడీ), జనరల్ సర్జరీ ఓటి టేబుల్, రికవరీ ట్రోలీలు, సిరంజీ పంప్స్, క్లినికల్ సక్షన్ ఆపరాటస్ సహా పలు పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, తహసిల్దార్ విజయ్ ప్రకాశ్ రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు జిల్లా 4వ మహాసభల విజయానికి ఆర్థిక సహకారాలు అందించాలి

**- మహాసభల కరపత్రం ఆవిష్కరణ**
**- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి : గురిజాల శ్రీధర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో నవంబర్ 29, 30 తేదీల్లో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరగనున్న సిఐటియు జిల్లా 4వ మహాసభల కరపత్రాన్ని బూరుగుపల్లి గ్రామంలో హమాలి కార్మికుల సమక్షంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గురిజాల మంగళవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో కార్మిక వర్గం, కష్టజీవులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా సిఐటియు ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధనలో నిలకడగా పోరాడే ఏకైక సంఘం సిఐటియు అని అన్నారు.సిరిసిల్లలో జరిగే మహాసభల్లో రాష్ట్ర నాయకత్వం పాల్గొంటుందని, కార్మికుల సమస్యలు,గత పోరాటాలను సమీక్షించి రాబోయే రోజుల్లో భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించి కొత్త కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. వేలాది మంది కార్మికులతో భారీ ర్యాలీ, ప్రదర్శన, బహిరంగ సభతో మహాసభలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.ఈ మహాసభల విజయానికి జిల్లాలోని పవర్లూమ్,బీడీ,హమాలి, భవన నిర్మాణ కార్మికులు, గ్రామపంచాయతీ%-%మునిసిపల్ కార్మికులు,ఆశా, అంగన్వాడి,మధ్యాహ్న భోజనం కార్మికులు, హాస్పిటల్%-%ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు కార్మికులు,అలాగే మిత్రులు,శ్రేయోభిలాషులు, ఉద్యోగులు,ఉపాధ్యాయులు, వ్యాపారస్తులు,ప్రజా ప్రతినిధులు తమ వంతు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గురజాల శ్రీధర్, హమాలి సంఘం అధ్యక్షులు సురుగు నాంపల్లి,సభ్యులు కోరేపు రాజు,కల్లేపల్లి రవి, బరిగే రమేష్,నేరెళ్ల బాలయ్య, పెరుమాండ్ల తిరుపతి,సూదుల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 'సర్'కు వ్యతిరేకంగా కేరళలో బీఎల్ఓల ఆందోళన

తిరువనంతపురం : ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)కు వ్యతిరేకంగా కేరళ వ్యాప్తంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) సోమవారం ఆందోళనకు దిగారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకూ సర్‌ను వాయిదా వేయాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. తిరువనంతపురంలో అసెంబ్లీకి సమీపంలో ఉన్న రాష్ట్ర ఎన్నికల ప్రధానధికారి రతన్ కేల్కర్ కార్యాలయం దిశగా బీఎల్ఓలు చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. అలాగే, వివిధ జిల్లాల్లోని రిటర్నింగ్ అధికారుల కార్యాయాల ఎదురుగానూ నిరసనలను నిర్వహించారు. తిరువనంతపురంలో ఆందోళనల సందర్భంగా బీఎల్ఓల సంఘాల నాయకులు మాట్లాడుతూ సర్ వాయిదా వేయాలనే తమ డిమాండ్‌ను ఎన్నికల సంఘం పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. అలాగే గణన ఫారమ్‌ల పంపిణీకి సంబంధించి అధికారులు తప్పుదారి పట్టించే సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని నాయకులు ఆరోపించారు. 94.5 శాతం ఫారాలు పంపిణీ అయ్యాయని ఈసీ, కలెక్టర్లు చేసున్న వాదనను నాయకులు విమర్శించారు. తమ డిమాండ్‌ను పట్టించుకోకపోతే సర్ కార్యక్రమాన్ని బహిష్కరిస్తామని నాయకులు హెచ్చరించారు.

## జగ్గారావుపల్లిలో వైద్య విద్యార్థి రమ్య సేవాదాతృత్వం

**- ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్ పంపిణీ**
**- విద్యార్థులు క్రమశిక్షణ, స్వలక్షణాలతో విద్యలో రాణించాలి**
**- డాక్టర్ రమ్య తండ్రి : మహంకాళి శంకర్**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని జగ్గారావుపల్లి గ్రామానికి చెందిన మహంకాళి రమ్య ప్రస్తుతం డాక్టర్ ఆఫ్ మెడిసిన్ చదువుతోంది. ఆమె పుట్టినరోజు సందర్భంగా మంగళవారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.రమ్య తండ్రి మహంకాళి శంకర్, కరీంనగర్ ఎల్ఎండీ కాలనీ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. స్వగ్రామం పట్ల ప్రేమతో తమ కుమార్తె పుట్టినరోజును స్ఫూర్తిదాయకంగా సేవా కార్యక్రమంతో జరుపుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ "ప్రభుత్వ పాఠశాలలో నేర్చుకున్న విలువలే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చాయి. పిల్లలు క్రమశిక్షణ, మంచి అలవాట్లతో చదువులో ముందంజవేయాలి" అని శంకర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకయ్య, ఉపాధ్యాయులు నరేష్, విద్యార్థులు, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం అధ్యక్షుడిగా ఉనిగొర్ల నర్సింగ్ యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక



మేడ్చల్( ప్రశ్న న్యూస్) యాదవుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఉనిగొర్ల నర్సింగ్ యాదవ్ అన్నారు. ఆదివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షుడిగా ఉనిగొర్ల నర్సింగ్ యాదవ్, ఉపాధ్యక్షుడు అనిల్ యాదవ్, సెక్రటరీ సంపత్ యాదవ్, జాయింట్ సెక్రటరీ మురళీ యాదవ్, క్యాషియర్ పెంజర్ల మహేష్ యాదవ్, కమిటీ సభ్యులుగా మోహన్ యాదవ్, ప్రశాంత్ యాదవ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు నర్సింగ్ యాదవ్ మాట్లాడుతూ యాదవులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గోపాల్ యాదవ్, నాగేష్ యాదవ్, చంద్రయ్య యాదవ్, నాగమల్లయ్య యాదవ్, శంకరయ్య యాదవ్, రాము యాదవ్, సురేష్ యాదవ్, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## అలా నేనెప్పుడూ అనుకోలేదు..

బాలయ్య 'వీర సింహారెడ్డి' సినిమాతో హనీ రోజ్ ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. తమిళ, మలయాళ, హిందీ చిత్రాల్లో నటించి మెప్పించింది. తెలుగులో ఒక్క సినిమాతో అమ్మడు రేంజ్ మారిపోయింది. కానీ ఆ తర్వాత ఎలాంటి అవకాశాలు రాకపోవడంతో రెండేళ్ల పాటు ఇండస్ట్రీకి కాస్త గ్యాప్ ఇచ్చింది. ఇప్పుడు మళ్లీ 'రాహెల్' సినిమాతో సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేయనుంది. వినాయన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో రోషన్ బషీర్, రాధికా రాధాకృష్ణన్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ మూవీ డిసెంబర్ 6న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈక్రమంలో.. తాజాగా, ప్రమోషనల్ కంటెంట్ పెంచుకునేందుకు మూవీ మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ఈవెంట్‌లో పాల్గొన్న హనీ రోజ్ కీలక వ్యాఖ్యలు చేసింది. "మలయాళ ఇండస్ట్రీకి నా అవసరం ఉందా? అని నన్ను అడిగితే లేదనే చెప్తాను. నేనే ఈ ఇండస్ట్రీకి గట్టిగా అతుక్కుపోయాను. నేను సినిమా ఇండస్ట్రీకి అడుగుపెట్టి రెండు దశాబ్దాలవుతోంది. దర్శకుడు వినాయన్ సర్ మొదటి నుంచి నా వెన్నంటే ఉంటున్నారు. 'రాహెల్' సినిమాతో నా కెరీర్ టర్న్ అవుతుందని అనుకుంటున్నారు. నాకు బోలేడన్ని అవకాశాలు రావాలి.. వచ్చినవన్నీ చేసుకుంటూ పోవాలని నేనెప్పుడూ అనుకోలేదు. వచ్చినవాటిల్లో ఉత్తమమైన వాటినే ఎంపిక చేసుకోవాలనుకుంటున్నా. వాటికోసమే కష్టపడతాను. సినిమా అంటే నాకు అంత పిచ్చి" అని చెప్పుకొచ్చింది.

## ప్రశాంత్ నీల్ సమర్పణలో సరికొత్త హారర్ మూవీ స్టార్ట్..



బ్లాక్ బస్టర్ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ మరో క్రియేటివ్ ప్రాజెక్ట్‌ను స్టార్ట్ చేశారు. యంగ్ టాలెంట్స్‌తో రాబోతున్న ఈ సరికొత్త హారర్ మూవీలో సూర్య రాజ్ వీరబత్తిని, హను రెడ్డి, ప్రీతి పగడాల ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. కీర్తన్ నాదగౌడ డైరెక్ట్ చేస్తోంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో అట్టహాసంగా జరిగాయి. చిత్రబృందం మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొని మూవీ ప్రారంభాన్ని సెలబ్రేట్ చేసింది. గ్రామీణ నేపథ్యంలో ఉన్న ఒక మెడికల్ కాలేజ్‌లో జరిగే భయానక సంఘటనల చుట్టూ కథ తిరుగనుందని తెలుస్తుండగా.. సైన్స్, మిస్టరీ, మూఢనమ్మకాల నేపథ్యంలో కొత్త కాన్సెప్ట్‌ను ప్రేక్షకులకు అందించబోతున్నామని చెబుతున్నారు మేకర్స్. కొత్త తరహా హర్రర్ కథ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు ఈ సినిమా మంచి సర్‌ప్రైజ్ ఇవ్వనుందని హామి ఇస్తున్న మేకర్స్.. ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలుకానుందని ఈ సందర్భంగా తెలిపారు.

## ఫస్ట్ కాపీ చూసి సినిమాపై కాన్ఫిడెన్స్ పెరిగింది



నరేష్ మేడి, రాగ్, రజిత శాండీ, రణధీర్ బీసు, రాఘవ మందలపు, పెద్ది రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'ఆపరేషన్ పద్మ'. ఈ చిత్రాన్ని క్రిషవ్ సినిమాస్, కేవీఎం ఆర్ట్స్ ఎల్ఎల్పీ బ్యానర్స్‌పై ఘట్టమనేని అరవింద్ బాబు, రాఘవ మందలపు, రాంబాబు మందలపు నిర్మిస్తున్నారు. కార్తీక్ మందలపు కో ప్రొడ్యూసర్‌గా, కె టి మల్లికార్జున క్రియేటివ్ హెడ్‌గా వ్యవహరిస్తున్నారు. కార్తికేయ.వి. దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ 'ఆపరేషన్ పద్మ' సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు నరేష్ మేడి మాట్లాడుతూ.. పొలిటికల్ డ్రామా నేపథ్యంగా సాగే మంచి సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ ఇది. ఫస్ట్ కాపీ చూసిన తర్వాత సినిమా మీద కాన్ఫిడెన్స్ బాగా పెరిగింది. ఇది థియేట్రికల్ గానే ప్రేక్షకులకు చేరువ చేయాలి అనిపించింది. నాకు ఈ చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ కార్తికేయకు మా ప్రొడ్యూసర్స్ కు థ్యాంక్స్. అన్నారు. హీరోయిన్ రజిత శాండీ మాట్లాడుతూ.. 'ఈ చిత్రంలో పద్మ క్యారెక్టర్‌లో నటిస్తున్నాను. నా క్యారెక్టర్‌కు రెండు షేడ్స్ ఉంటాయి. 20 రోజులు ఈ సినిమా కోసం వర్క్ షాప్ చేశాం. థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న నా మొదటి చిత్రమిది. ఒక డిఫరెంట్ పొలిటికల్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీగా మీ అందరినీ ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాం. అన్నారు.

## కార్తీ సినిమాకు ఇన్ని కష్టాలేంటబ్బా



స్టార్ హీరో సూర్య తమ్ముడిగా పరిచయమైనా మొదటి సినిమా పరుత్తి వీరన్ తోనే తానేంటో ఋజువు చేసుకున్న కార్తీకి తెలుగులోనూ మార్కెట్ ఉంది. ఈ మధ్య వరస ఫ్లాపుల వల్ల కొంచెం వెనుకబడ్డాడు కానీ సరైన బ్రేక్ దొరికితే మళ్ళీ పుంజుకుంటాడు. ఇంత ఇమేజ్ ఉన్న కార్తీకి బిజినెస్ పరంగా ఇబ్బందులు లేవు. నిర్మాతలకు డీల్స్ బాగానే జరుగుతాయి. కానీ ఒక మూవీ విషయంలో మాత్రం రివర్స్ లో అవుతోంది. 2023లో ప్రకటించి షూటింగ్ మొదలుపెట్టిన చిత్రం వా వాతియర్. సూదు కవ్వం లాంటి క్లాసిక్ ఇచ్చిన నలన్ కుమారస్వామి దర్శకుడు. ఉప్పెన ఫేమ్ కృతి శెట్టి హీరోయిన్ గా నటించింది. సంతోష్ నారాయణన్ సంగీతం. గత ఏడాది టైటిల్ ప్రకటించారు. ఎప్పటికప్పుడు అదిగో ఇదిగో అంటూ రిలీజ్ డేట్లు అనౌన్స్ చేయడం, వాయిదా వేయడం పరిపాటిగా మారింది. మొన్నెప్పుడో డిసెంబర్ 5 అన్నారు. ఇప్పుడా డేట్ కి రావడం అనుమానమే. ఎదురుగా అఖండ 2 పెట్టుకుని రిస్క్ అనుకోలేదు కానీ ఏవో ఆర్థిక కారణాల వల్ల మళ్ళీ పోస్ట్ పోన్ తప్పలేదట. ఓటిటి హక్కులకు అనుకున్న మొత్తం రాకపోవడం వల్లే నిర్మాత ధైర్యం చేయలేకపోతున్నాడని ఒక టాక్ ఉంది. ప్రొడ్యూసర్ ఎవరో కాదు. స్వయానా కార్తీ కుటుంబ సభ్యుడు జ్ఞానవేల్ రాజా. కంగువతో అందరికీ ఖంగు తినిపించిన ఈయన్ని ఫ్యాన్స్ అంత సులభంగా మర్చిపోరు. ఇప్పుడా కంగువ తాలూకు ఎఫెక్ట్ వా వాతియర్ మీద పడిందని చెన్నై టాక్. కార్తీ గత సినిమాలు ఆశించిన స్థాయిలో పెర్ఫార్మ్ చేయలేకపోవడం, జపాన్ లాంటివి మరీ దారుణంగా డిజాస్టర్ కావడం డిజిటల్ కంపెనీలను వెనుకడుగు వేసేలా చేస్తున్నాయట. మరి ఎప్పుడు మోక్షం దక్కుతుందో అంతు చిక్కడం లేదు.

## ఐబొమ్మ రవిని మంచి పనికి వాడుకోవాలి



పైరసీ వెబ్ సైట్ ఐబొమ్మ అడ్మిన్ ఇమ్మడి రవి అరెస్ట్ వ్యవహారం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. దీని గురించి సీనియర్ నటుడు శివాజీ స్పందించాడు. రవిని విమర్శిస్తూనే.. అతడిది అసాధారణమైన ప్రతిభ అని అర్థమవుతోందని.. అతణ్ని మంచి పని కోసం వాడుకోవాలని శివాజీ అభిప్రాయపడ్డాడు. రవి చేసంది దుర్మార్గమైన పని అని.. అతనేదో మంచి చేస్తున్నాను అనుకున్నాడని.. కానీ దాని ద్వారా చాలామందికి చెడు చేశాడని శివాజీ అన్నాడు. ఐతే రవి గురించి విన్నపుడు.. అతడికేదో బాధ, డబ్బుల కోసం ఇదంతా చేశాడని అర్థమైందని.. అతనొక బ్రహ్మాండమైన హ్యాకర్ అని స్పష్టమవుతోందని.. ఇలాంటి ప్రతిభ ఉన్న వ్యక్తిలో మార్పు రావాలని.. వచ్చాక అతణ్ని దేశానికి సంబంధించిన సెక్యూరిటీ సిస్టమ్స్‌లో మంచి కోసం ఉపయోగించుకుంటే బాగుంటుందని శివాజీ అన్నాడు. తాను ప్రధాన పాత్ర పోషించిన 'దండోరా' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో శివాజీ ఈ వ్యాఖ్యలు చేశాడు. మరోవైపు సినిమా థియేటర్లలో పాప్ కార్న్ రేట్ల గురించి కూడా శివాజీ స్పందించాడు. సినిమాకు, పాప్ కార్న్‌కు ముడిపెట్టొద్దని ఆయన విన్నవించారు. రెంటికీ ఏం సంబంధం అని ఆయన ప్రశ్నించారు. సినిమా టికెట్ల రేట్ల విషయానికి వస్తే అవి అందుబాటులోనే ఉన్నాయని.. ప్రపంచంలో సినిమాను మించిన చౌక అయిన వినోదం మరొకటి లేదని శివాజీ అభిప్రాయపడ్డాడు. దశాబ్దాల కిందట వచ్చిన మిస్సమ్మ, మాయాబజార్ సినిమాల గురించి ఇప్పటికీ మాట్లాడుతున్నాం, గుర్తుంచుకున్నాం అని.. అదీ సినిమా చూపించే ప్రభావం అని శివాజీ అన్నాడు. థియేటర్లో 100 రూపాయలు పెట్టి చిప్స్ ప్యాకెట్ కొంటే అందులో 20 చిప్స్‌కు మించి ఉండవని.. కానీ 200 రూపాయలు పెట్టి సినిమా చూస్తే అదొక మంచి అనుభూతిని ఇచ్చి మన జీవితాంతం గుర్తుంటుందని శివాజీ అన్నాడు. పాప్ కార్న్ రేట్ల గురించి ఎక్కువ బ్లో అప్ చేయాల్సిన అవసరం లేదని.. దానికి సినిమాకు ఏం సబంధం అని శివాజీ ప్రశ్నించాడు.

## 'నా తెలుగోడు'.. ఓ సైనికుడి కథ



హరినాథ్ పోలిచర్ల స్వీయ డైరెక్షన్‌లో రాబోతున్న చిత్రం 'నా తెలుగోడు'. డ్రీం టీం ప్రొడక్షన్స్‌పై హరినాథ్ పోలిచర్ల నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సినిమాపై ఆసక్తిక కామెంట్స్ చేశారు హరినాథ్ పోలిచర్ల. 'నా తెలుగోడు అనే సినిమా షూటింగ్, సెన్సార్ పూర్తిచేసుకుని డిసెంబర్ 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాము. సమాజానికి ఉపయోగపడే ఒక విషయాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకుని వెళ్ళాలి అనే ఉద్దేశంతో చేశాము. ఒక సైనికుడు దేశం కోసం జీవితాన్ని త్యాగం చేస్తారు. వారి జీవితంపై, ఆడపిల్లలను కాపాడటంపై, డ్రగ్స్ నుండి సమాజాన్ని కాపాడే కొన్ని అంశాలను ఈ సినిమాలో చూపించాలి అనే ప్రయత్నం చేశాము. ఈ సినిమాలో యుద్ధ నేపద్యంలో కొన్ని సీన్స్ ఉంటాయి. గోవా, మునార్, హైదరాబాద్ ఇంకా కొన్ని ప్రాంతాలలో ఈ సినిమాను చిత్రీకరించడం జరిగింది. సినిమాకు కట్స్ లేకుండా రావడం మాకు సంతోషకరం. ఇందులో నేను సైనికుడుగా కనిపిస్తాను. రవాణా కోసం ఉపయోగించుకుంటున్నారు. అది అసాంఘిక కార్యక్రమం. వాటిని అరికట్టే ఉద్దేశంతో ఈ సినిమాలో కొన్ని సీన్లు ఉంటాయి. ఇందులో ఉండే మంచి కోణం అందరిని ఆకట్టుకుంటోంది. నన్ను నా సినిమాను అందరూ ప్రోత్సహించాలి అని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

## గెట్ రెడీ.. సూర్య 47 షూటింగ్ మొదలయ్యే టైం ఫిక్స్..!




47 ఎ కోలీవుడ్ స్టార్ యాక్టర్ సూర్య వరుస సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. ఇప్పటికే ఆర్జే బాలాజీ డైరెక్షన్‌లో కరుప్పు సినిమా చేస్తుండగా.. మరోవైపు సూర్య 47 ప్రాజెక్టును కూడా లైన్‌లో పెట్టాడు. మాలీవుడ్ మూవీ ఆవేశం ఫేం జీతూ మాధవన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం షూటింగ్ వచ్చే నెలలో షురూ కానుందని తాజా వార్త ఒకటి తెరపైకి వచ్చింది. ఈ చిత్రంలో నజ్రియా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. నస్లేన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. సూర్య ఈ చిత్రంలోపవర్ ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడని సమాచారం. మలయాళం, తమిళ బైలింగ్యువల్ మూవీగా రాబోతున్న ఈ చిత్రం కోసం జీతూమాధవన్ టీం లొకేషన్ వేటలో బిజీగా ఉంది. త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించి అధికారిక ప్రకటన కూడా ఉండబోతున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. సూర్య కొత్తగా లాంచ్ చేసిన ప్రొడక్షన్ హౌస్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కించనుండగా.. పూర్తి వివరాలపై క్లారిటీ రావాల్సి ఉంది. మలయాళంలో యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఫహద్ ఫాసిల్ హీరోగా జీతూ మాధవన్ తెరకెక్కించిన ఆవేశం బాక్సాఫీస్ వద్ద రికార్డుల వర్షం కురిపించింది. మరి జీతూ మాధవన్ సూర్యతో సిల్వర్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నాడని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్.

# భక్తులకు అన్ని వసతులు కల్పించాలి

- ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే : ఆది శ్రీనివాస్
- భీమేశ్వర స్వామి ఆలయ ఏర్పాట్లపై కలెక్టర్,ఎస్పీతో సమీక్ష



**వేములవాడ/ సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గీతే, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అన్నారు. ఈ సందర్భంగా ముందుగా ఆలయానికి రోజువారీ విచ్చేసే భక్తుల సంఖ్య, వారు చెల్లించుకునే వివిధ మొక్కుల వివరాలను అధికారులతో ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ పరిధిలో క్యూలైన్లు, ప్రత్యేక పూజలు, మొక్కుల కౌంటర్లు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులను మెరుగుపరచాలని సూచించారు.శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం సమీపంలోని రావి చెట్టు వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాలపై కూడా చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా శాశ్వత, తాత్కాలిక ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, ఆర్అండ్బీ ఈఈ నరసింహ చారి, ఆలయ ఈఈ రాజేష్,మున్సిపల్ మేనేజర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో నేడు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విస్తృత పర్యటన

- కాంగ్రెస్ పార్టీ బోయినిపల్లి మండలాధ్యక్షులు : వన్నెల రమణారెడ్డి



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ బోయినిపల్లి మండలాధ్యక్షులు వన్నెల రమణారెడ్డి వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిడ్ మానేర్ (కొదురుపాక): చేప పిల్లల విడుదల కార్యక్రమం,నీలోజిపల్లి గ్రామంలో స్వచ్ఛ భారత్ పథకంలో నిర్మించిన కమ్యూనిటీ టాయిలెట్స్ ప్రారంభోత్సవం,బోయినిపల్లి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ,రైతు వేదిక, బోయినపల్లి రైతు వేదికలో కళ్యాణ లక్ష్మీ,ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యం పాల్గొంటారని,ఈ కార్యక్రమాలకు ప్రజలు,లబ్ధిదారులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి పిలుపునిచ్చారు.

# రైతుల జీవితాలతో చలగాటమాడుతున్న జాన్ డీర్ ట్రాక్టర్ల యాజమాన్యం

- వ్యవసాయం కోసం అప్పులు చేసి లక్షలు పెట్టి ట్రాక్టర్ల కొనుగోలు చేసిన రైతన్నలు
- ట్రాక్టర్లు రిపేరుకస్తే సర్వీసు నిల్లు
- జగిత్యాల జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతన్నలు
- కలెక్టర్ స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని జిల్లా వ్యాప్త రైతులు కోరుతున్నారు





**జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్)** జాన్ డీర్ అనేది ఒక ట్రాక్టర్ల కంపెనీ, ఇది వ్యవసాయం, నిర్మాణం, అటవీ సంరక్షణ,గడ్డి భూముల నిర్వహణ కోసం ట్రాక్టర్లు మరియు ఇతర పరికరాలను తయారు చేస్తుంది. అయితే ఇటీవల జగిత్యాల జిల్లా వ్యాప్తంగా వ్యవసాయం కోసం అప్పులు చేసి లక్షలు పెట్టి ట్రాక్టర్ల కొనుగోలు చేసిన రైతన్నలు ట్రాక్టర్లు రిపేరుకస్తే జగిత్యాలలో ఉన్న జాన్ డీర్ షో రూంకు వెళితే రైతన్నలతో ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు లక్ష్మీపూర్ చెందిన రైతన్నలు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్లు రిపేరు చేయకుంటే వ్యవసాయం చేయటంలో చాల ఇబ్బందులు ఉంటున్నాయని లక్ష్మీపూర్ రైతన్నలతో పాటు జగిత్యాల జిల్లా వ్యాప్త రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని జిల్లా వ్యాప్త రైతులు కోరుతున్నారు.

# డ్రగ్స్ రైత సమాజ కోసం కృషి చేయాలి

- గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** డ్రగ్స్ రైత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ అన్నారు. కేంద్ర రాష్ట్రల ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కార్యాలయం ముందు నిర్వహించారు. కమిషనర్ వెంకట గోపాల్ పాల్గొని మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట గోపాల్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే హానిని వివరించారు. మాదకద్రవ్యాల ను సేవించడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మాదకద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు. మారకద్రవ్యాల వల్ల తమ కుటుంబ వాలే కాకుండా సమాజానికి సైతం నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. డ్రగ్స్ రైతు సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు జూనియర్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అవగాహన కు విశేష స్పందన



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ అధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ మేడ్చల్ ట్రాఫిక్ ట్రాఫిక్ ఏసిపి వెంకట్ రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ సిఐ మధుసుధన్, అధికారులతో కలిసి విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ సీట్‌బెల్ట్ ఉపయోగం, రోడ్డు సూచికల ప్రాముఖ్యత వివరించారు. విద్యార్థులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపడం వల్ల జరిగే అనర్థాలకు మూల్యం చెల్లించు కోవాల్సి వస్తుందని తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడపడం వల్ల జరిమానాలకు గురికావాల్సి వస్తుందని, అంతేకాకుండా జరగరానిది జరిగితే ఇంటిల్లిపాది బాధపడాల్సి వస్తుందని, వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమానికి చైర్మన్ టి. బాల రెడ్డి, సెక్రటరీ, టి.వి. రెడ్డి, డైరెక్టర్లు టి. సరోజా రెడ్డి, టి. అనురాగ్ రెడ్డి, ప్రిన్సిపల్ ఏ. రామస్వామి రెడ్డి,, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అసం రాజేశ్ హాజరయ్యారు.

# అంతర్జాతీయ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి ఆర్థిక సహాయం



**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** మేడ్చల్ జిల్లాకు చెందిన క్రీడాకారుడు, దివ్యాంగుడైన ధీరవత్ మహేష్, భారతదేశంలోనూ విదేశాలలోనూ పలు క్రీడా ఈవెంట్‌లలో పాల్గొని, రాష్ట్ర స్థాయిలో 11 పతకాలు (3 బంగారు, 5 వెండి, 3 కాంస్య) సాధించారు. ఇటీవల ఆయన శ్రీలంకలో జరగనున్న జూనియర్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌కు కెప్టెన్‌గా ఎంపికయ్యారు. ఈ క్రీడలలో పాల్గొనడానికి రవాణా, భాగస్వామ్య ఖర్చుల నిమిత్తం రూ. 59 వేల ఆర్థిక సహాయం చేయాలని ఆయన అభ్యర్థించారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజ్గిరి ?జిల్లా యువజన, క్రీడా అధికారి ఈ అభ్యర్థనను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇండియా పారా త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పేరు మీద రూ. 59 వేల చెక్‌ను అందించారు. ఈ మొత్తం ధీరవత్ మహేష్ కి ఎయిర్‌ఫేర్ ఛార్జీల నిమిత్తం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ) రాధికా గుప్తా ద్వారా అందజేశారు.

# ఎంఐఎంఎస్ లో ఆప్తమాలజీ విభాగాన్ని ప్రపంచ శ్రేణిలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తాం

- చైర్మన్ డాక్టర్ గుల్లపల్లి నాగేశ్వరరావు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో ఆప్తమాలజీ విభాగాన్ని ప్రపంచ శ్రేణిలో అభివృద్ధి చేయడానికి సాంకేతిక నైపుణ్యంతో పాటు సహకారాన్ని అందించనున్న ఎల్వి ప్రసాద్ కంటి ఇన్స్టిట్యూట్ వ్యవస్థాపకులు చైర్మన్ డాక్టర్ గుల్లపల్లి నాగేశ్వరరావు అన్నారు. మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లోని ఆప్తమాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కంటిన్యూస్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద కంటి పరిస్థితులపై సమగ్ర అవగాహనపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్వి ప్రసాద్ కంటి ఇన్స్టిట్యూట్ వ్యవస్థాపకులు, చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ గుల్లపల్లి నాగేశ్వర రావుతో పాటు అమెరికాలో ప్రఖ్యాతి గడించిన కంటి వైద్య నిపుణులు, పరిశోధకులు అమెరికాలో గల యూనివర్శిటి ఆఫ్ కాలిఫోర్నియా డీన్ గా నియమించబడిన మొట్టమొదటి తెలుగు భారతీయుడు డా. నర్సింగ్ రావు, ఎల్వి ప్రసాద్ కంటి ఇన్స్టిట్యూట్ కు చెందిన వైద్య నిపుణులు డాక్టర్ పద్మజకుమార్ రాణి, షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మధు కె మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మధు కె మోహన్ మాట్లాడుతూ మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మరియు ఎల్వి ప్రసాద్ కంటి ఇన్స్టిట్యూట్ లు కలసి పని చేయడం ద్వారా కళాశాలలోని ఆప్తమాలజీ వైద్య విభాగానికి లాభం చేకూరుతుందన్నారు. అనంతరం ఎల్వి ప్రసాద్ కంటి ఇన్స్టిట్యూట్ వ్యవస్థాపకులు, చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ గుల్లపల్లి నాగేశ్వర రావు మాట్లాడుతూ మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ తో కలసి ఎల్వి ప్రసాద్ కంటి ఇన్స్టిట్యూట్ కలసి పని చేస్తుందని ప్రకటించారు. ఇలా రెండు సంస్థల మధ్య భాగస్వామ్యం ద్వారా ఇరువురుకి మేలు కలుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎల్విప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ అందజేసే సాంకేతిక పరిజ్ఞానంతో మెడిసిటి హాస్పిటల్ లోని ఆప్తమాలజీ విభాగాన్ని అత్యున్నత శ్రేణికి చేరేలా పని చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవేంద్ర సింగ్ నేగి, మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలేంద్ర, మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆప్తమాలజీ విభాగం అధిపతి డాక్టర్ వై. జయశాంతి లత, ఆప్తమాలజీ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ యస్ స్రవంతి, డాక్టర్ రత్నకుమారి లతో పాటూ పిజి వైద్యులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాటినం ఆభరణాల దిగుమతులపై ఆంక్షలు విధించిన ప్రభుత్వం

విలువైన లోహాల దిగుమతులపై కేంద్రం కఠిన నిబంధనలు అమలుచేస్తోంది. ఇటీవలే వెండి ఆభరణాల దిగుమతులపై వచ్చే ఏడాది మార్చి 31 వరకు అంక్షలు విధించిన కేంద్రం, తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. కొన్ని రకాల ప్లాటినం ఆభరణాల దిగుమతులను పరిమితం చేస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(డీజీఎఫ్‌టీ) సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది 2026, ఏప్రిల్ 30 వరకు అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుంది. దిగుమతిదారులు ఎలాంటి వస్తువులను దిగుమతి చేసుకోవాలన్నా, ముందుగా డీజీఎఫ్‌టీ నుంచి లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం అనవసరమైన దిగుమతులను అరికట్టడానికి, విదేశీ మారక నిల్వలను కాపాడటానికి, ద్వైపాక్షిక, ప్రాంతీయ వాణిజ్య ఒప్పందాల ప్రకారం న్యాయమైన వాణిజ్య పద్ధతులను అనుసరించేందుకు ప్రభుత్వం చేస్తున్న విస్తృత ప్రయత్నంలో భాగమని డీజీఎఫ్‌టీ వెల్లడించింది. ఈ నిర్ణయం ఉన్న సమయంలో స్టడ్ చేయని, సెమీ-ఫినిష్డ్ ఆభరణాలతో సహా అన్ని ప్లాటినం ఆభరణాల దిగుమతులకు ముందస్తు అనుమతి అవసరం.

# అవగాహనతోనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యం

- కరీంనగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : నిరంజన్ రెడ్డి
- విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన
- ప్రతిజ్ఞ చేయించిన సీఐ నిరంజన్ రెడ్డి



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు కరీంనగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో దుర్శేడ్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన- ప్రతిజ్ఞ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.విద్యార్థులకు మాదక ద్రవ్యాలు సమాజంపై చూపే ప్రభావాలు, వాటివల్ల కలిగే శారీరక%-%మానసిక నష్టాలను వివరించిన ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులందరితో "నేను డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తాను. నా చుట్టుపక్కలివారిలో ఎవరూ మాదక ద్రవ్యాలకు బారిన పడకుండా జాగ్రత్త పడతాను. డ్రగ్స్ విక్రయం, కొనుగోలు లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తాను. డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో నేను భాగస్వామిని అవుతాను. జైహింద్" అని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి, ఎస్ఐ సయ్యద్ అంజద్, పాఠశాల హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# హసీనాకు మరణశిక్షతో భగ్గుమన్న బంగ్లాదేశ్

బంగ్లాదేశ్ లో మరోసారి అల్లర్లు చెలరేగాయి. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాకు బంగ్లా ప్రత్యేక ట్రిబ్యునల్ మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ తీర్పుతో బంగ్లాలో అల్లర్లు చెలరేగాయి. కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా హసీనా మద్దతుదారులు, అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. వారి ఆందోళనలతో బంగ్లాలో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ అవామీలీగ్ పార్టీ రెండు రోజులపాటూ దేశవ్యాప్తంగా బంద్ ప్రకటించింది. దీంతో యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అప్రమత్తమైంది. ఢాకా సహా ఇతర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. భారీగా పోలీసులు మోహరించారు. మరోవైపు నిరసనకారులు ఢాకాలోని అనేక రహదారులను దిగ్బంధించారు. అప్రమత్తమైన పోలీసులు నిరసనకారులను చెదరగొట్టేందుకు లాఠీ ఛార్జ్ చేశారు. సౌండ్ గ్రెనేడ్‌లను, టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. తాజా అల్లర్లలో ఇద్దరు వ్యక్తులు మరణించారు.

# మమ్దానీతో భేటీ అవుతా : ట్రంప్

న్యూయార్క్ నగర మేయర్‌గా ఎన్నికైన మమ్దానీతో సమా వేశమవుతానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. పరస్పరం అభిప్రాయాలు పంచు కుంటామని, పలు అంశాలపై చర్చించుకుంటామని చెప్పారు. న్యూయార్క్ కోసం అంతా మంచే జరిగేలా తాము ప్రయతిస్తామని అన్నారు. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోతో కూడా చర్చలకు సిద్ధమేనని ట్రంప్ ఇప్పటికే చెప్పారు. 'నేను ఎవరితో అయినా మాట్లాడతా' అని వ్యాఖ్యానించారు. కాగా ట్రంప్-మమ్దానీ సమావేశం ఎప్పుడు జరిగేదీ ఇంకా ఖరారు కాలేదని శ్వేతసౌధం పత్రికా కార్యదర్శి కరోలిన్ లీవిట్ అన్నారు. మమ్దానీ విజయం తర్వాత న్యూయార్క్ నగరానికి ప్రభుత్వం కేటాయించే నిధులపై ట్రంప్ సహాయకులు సమీక్ష జరుపుతున్నారు. ఏయే కార్యక్రమాలను పక్కన పెట్టాలి లేదా రద్దు చేయాలి అనే విషయంపై కసరత్తు జరుగుతోంది. మమ్దానీని మేయర్‌గా ఎన్నుకున్న న్యూయార్క్ నగరంపై ట్రంప్ ఇంకా కోపంతోనే ఉన్నారనడానికి ఇది సంకేతంగా కన్పిస్తోంది. నిధుల నిలిపివేతకు సంబంధించి ట్రంప్ ఇచ్చే ఆదేశాల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. శ్వేతసౌధం, మమ్దానీ తాత్కాలిక బృందం మధ్య ఇప్పటి వరకూ ఎలాంటి సంప్రదింపులు జరగలేదు. న్యూయార్క్ నగరం 2025 ఆర్థిక సంవత్సరంలో సుమారు 10 బిలియన్ డాలర్ల ప్రభుత్వ నిధులను అందుకుంది. ఇది దాని బడ్జెట్‌లో 8.3 శాతానికి సమానం. విద్య, గృహనిర్మాణం, సామాజిక సేవలు, అల్పాదాయ వర్గాల ప్రజలకు ఇతర రకాల సాయం వంటి వాటి కోసం ఈ నిధులను వెచ్చిస్తున్నారు.

# రష్యాతో వాణిజ్యం చేసే దేశాలపై మరిన్ని కఠిన ఆంక్షలు

రష్యాతో వాణిజ్యం చేసే ఏ దేశంపైనైనా చాలా కఠినమైన ఆంక్షలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి పెంచే చర్యలను కాంగ్రెస్ ఆమోదించాల్సిన సమయం ఆసన్నమైందా అని మీడియా ప్రశ్నకు సమాధానమిచ్చారు. కాంగ్రెస్ చట్టాన్ని ఆమోదిస్తోందని, రిపబ్లికన్లు చట్టాన్ని తీసుకువస్తున్నారని అన్నారు. రష్యాతో వ్యాపారం చేసే ఏ దేశంపైనైనా చాలా కఠినమైన ఆంక్షలు విధిస్తామని, ఇరాన్‌పై కూడా విధించవచ్చని అన్నారు.రష్యన్ చమురు ద్వితీయ కొనుగోళ్లు పున: విక్రయంపైప 500శాతం సుంకాన్ని ప్రతిపాదించే బిల్లును సెనెటర్ లిండ్సే గ్రాహం ప్రవేశపెట్టారు. ఈ ప్రతిపాదనకు సెనెట్ విదేశీ సంబంధాల కమిటీ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. గ్రాహం మరియు సెనెటర్ రిచర్డ్ బ్లూమెంటల్ సంయుక్తంగా 2025 నాటి రష్యా నిషేధ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఇది "ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి నిధులు సమకూర్చడం కొనసాగించే దేశాలపై" ద్వితీయ సుంకాలు, ఆంక్షలు విధిస్తుంది. ప్రతిపాదిత చట్టానికి సెనెట్‌లో 85మంది సభ్యులు ఆమోదం తెలిపారు. అధ్యక్షుడు ట్రంప్, ఆయన బృందం రష్యా మరియు ఉక్రెయిన్ మధ్య రక్తపాతాన్ని ముగించేందుకు ఒక కొత్త విధానాన్ని అమలు చేస్తూ.. శక్తివంతమైన చర్య తీసుకున్నారని గ్రాహం, బ్లూమెంటల్ జులైలో విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యుద్ధాన్ని ముగించడానికి అంతిమ చర్య చైనా, భారత్, బ్రెజిల్ వంటి దేశాలపై సుంకాలు విధించడం. ఇవి చౌకైన రష్యన్ చమురు, సహజవాయువులను కొనుగోలు చేయడం ద్వారా పుతిన్ యుద్ధానికి ఆసరగా నిలబతున్నాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ట్రంప్ గాజా శాంతి ప్రణాళికకు భద్రతా మండలి ఆమోదం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆమోదం తెలిపింది. రెండేండ్లుగా సాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి ముగింపుపలికేందుకు 20 సూత్రాల ప్రణాళికను డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ బలగాల నియోగం, యుద్ధ విరామం, పునర్నిర్మాణం, పాలనకు మార్గదర్శకాలు ఇందులో ఉన్నాయి. ఈ ఒప్పందంపై ఇజ్రాయెల్-పాలస్తీనా తీవ్రవాద గ్రూపు హమాస్ గత నెల 10న సంతకాలు చేశాయి. ఐక్యరాజ్యసమితో సోమవారం జరిగిన ఓటింగ్‌లో అమెరికా, యూకే, ఫ్రాన్స్, సోమాలియా సహా మొత్తం 13 దేశాలు గాజా శాంతి ప్రణాళికకు మద్దతు తెలిపాయి. వీటో అధికారం ఉన్న రష్యా, చైనా ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గత నెలలో యుద్ధ విరామం, బందీల విడుదల ఒప్పందంతో ప్రణాళిక మొదటి దశను అమలు చేసిన సంగతి తెలిసిందే. బోర్డ్ ఆఫ్ పీస్ అనే తాత్కాలిక సంస్థను ఏర్పాటు చేసి.. గాజా పునర్నిర్మాణాన్ని పర్యవేక్షించాలన్నది గాజా ప్లాన్ ఉద్దేశం.కాగా, ఈ తీర్మానాన్ని హమాస్ ఖండించింది. ఇది గాజా ప్రజల స్వతంత్రతను హరించడమేనని మండిపడింది.

పాలస్తీనా ప్రజల స్వాతంత్ర్యం, స్వయంపాలన హక్కులను ఈ తీర్మానం గౌరవించడంలేదని, ఇక్కడి ప్రజల రాజకీయ ఆకాంక్షలను పక్కన పెట్టి తాత్కాలిక పాలనా సంస్థ పేరుతో ఇతర దేశాల నిర్ణయాలను రుద్దే ప్రయత్నంగా కనిపిస్తున్నదని విమర్శించింది. గాజా భవిష్యత్తును గాజా ప్రజలే నిర్ణయించాలని, విదేశీ బలగాలు, పాలనా సంస్థలు తమ అభిప్రాయాలను రుద్దకూడదని పేర్కొంది. రెండేళ్ల క్రితం ఇజ్రాయెల్‌పై హమాస్ అనూహ్య దాడితో యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపు దాడికి దిగింది. దాదాపు 1,200 మందిని హతమార్చి, 250 మందికిపైగా బందీలుగా చేసుకుంది. హమాస్ దాడికి ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల్లో 67,000 మందికిపైగా పాలస్తీనా పౌరులు మరణించారు.

# 42 శాతం రిజర్వేషన్లు చట్టపరంగా అసాధ్యం!

## - బీసీలను ఇంకా మభ్యపెడుతున్న తెలంగాణ ప్రభుత్వం




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్తామని గతంలో చాలెంజ్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అవి సాధ్యం కాకపోవడంతో ఎలా ముందుకెళ్లాలా అన్నదానిపై కిందా మీదా పడుతోంది. సాధ్యం కావడం లేదు అని ప్రజలు చెప్పడానికి మొహమాట పడుతోంది. అలాగే మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోంది.

### బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని రేవంత్ ప్రకటన

తెలంగాణలో బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (బీసీ)లకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేసిన కాంగ్రెస్ హామీ, ఇప్పుడు తీవ్ర వివాదాస్పదమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ హామీని "కామారెడ్డి డిక్లరేషన్"గా ప్రకటించి, బీసీల ఓటు బ్యాంకును సృష్టించుకుంది. కానీ, తాజా హైకోర్టు స్టే, సుప్రీంకోర్టు తిరస్కారాలు, ఆర్థిక-చట్టపరమైన సమస్యల మధ్య, "ఇది సాధ్యమే కాదని " క్లారిటీ వస్తోంది. తెలంగాణలో బీసీలు 56 శాతం జనాభా ఉన్నారు. కులగణనలో ఇది తేల్చారు. కానీ 29 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఇవి ఉద్యోగ, విద్య అవకాశాల్లో. రాజకీయంగా అయితే స్థానిక ఎన్నికల్లో 25 శాతం రిజర్వేషన్ మాత్రమే ఉంది.

### కులగణన చేసినా .. బిల్లులకు లభించని ఆమోదం

కాంగ్రెస్ 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్'లో బీసీలకు 42% రిజర్వేషన్లు, కులగణన చేస్తామని ప్రకటించారు. కులగణన చేశారు. హౌస్-టు-హౌస్ డేటా కలెక్షన్ చేశారు. బీసీలు 56.33% అని రిపోర్ట్ వచ్చింది. ఈ డేటా ఆధారంగా అసెంబ్లీలో రెండు బిల్లులు పాస్ చేశారు. విద్య, ఉద్యోగ లోకల్ బాడీల్లో 42% బీసీ కోటా కల్పించారు. కానీ సుప్రీంకోర్టు పెట్టిన 50% కోటాను దాటిపోతుంది. బిల్లులు ఆమోదించాలని ఆగస్టులో రేవంత్ ఢిల్లీలో ధర్నా కూడా చేశారు. చివరికి జీవో ఇచ్చారు. జీవోపై హైకోర్టు స్టే ఇచ్చింది. ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్పి ఫైల్ చేసింది. ఆ ఎస్ఎల్పీని సుప్రీంకోర్టు కొట్టి వేసింది.

### రాజ్యాంగం తొమ్మిదో షెడ్యూల్ లో పెడితేనే చెల్లుబాటు.. అది సాధ్యం కాదు !

ఢిల్లీలో ధర్నా చేసినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి రాహుల్ ను ప్రధానిని చేసుకుని బిల్లును ఆమోదించుకుంటామని ప్రకటించారు. అంటే ఆయనకు ఇప్పుడల్లా లీగల్ గా రిజర్వేషన్లు రావని క్లారిటీ ఉన్నట్లే. అయితే బిల్లులు ఆమోదించడం లేదని కేంద్రాన్ని నిందిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "42% కోటా సైంటిఫిక్, బీసీల హక్కు. బిజేపీ కేంద్రం బిల్లులు పెండింగ్‌లో పెట్టి బీసీలను మోసం చేస్తోంది" అని ఆరోపిస్తున్నారు. కానీ న్యాయపరంగా ఊరట లభించలేదు. ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్ఎల్పి ఫైల్ చేసింది, కానీ ఎస్సీ "హైకోర్టు స్టే సరైనది" అని తిరస్కరించింది.

### ఇప్పటికీ అది సాధ్యం కాదని ప్రజలకు చెప్పలేకపోతున్న ప్రభుత్వం

సుప్రీం కోర్టు 1992 ఇంద్రా సాహ్నీ జడ్జ్‌మెంట్ ప్రకారం 50% రిజర్వేషన్ క్యాప్ పెట్టింది. కానీ తమిళనాడు 69 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టారు. కానీ తెలంగాణకు అది సాధ్యం కాదు. రాజ్యాంగసవరణ అవసరం. అది ఇప్పుడల్లా సాధ్యం కాదు. అందుకే సీఎం రేవంత్ బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రజలకు నిజాలు చెప్పి పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం కనిపిస్తోంది. లేకపోతే ప్రజలు ముఖ్యంగా బీసీలు తమను మోసం చేశారని అనుకునే ప్రమాదం ఉంది.

# బతుకమ్మ చీరల పంపిణీకి అంతా సిద్ధం

## రెండు దశల్లో పంపిణీ నేటి నుండే ప్రారంభం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ చీరల పంపిణీ' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నేటి నుండి ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ పంపిణీ ద్వారా రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు చేనేత వస్త్రాలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమంపై మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో పాటు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతీ మహిళకు నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడకుండా, నాణ్యమైన చీరలను అందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కోటి చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులే తయారు చేస్తున్నారు. ఈ భారీ ఆర్డర్ ద్వారా స్థానిక చేనేత పరిశ్రమకు , కార్మికులకు ఆర్థికంగా భారీ చేయూత లభించనుంది. పంపిణీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా సాంకేతికతను వినియోగించుకోవాలని, నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సీఎం సూచించారు. పెద్ద సంఖ్యలో చీరలు ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో పంపిణీ ప్రక్రియ ఆలస్యం కాకుండా ఉండేందుకు, ముఖ్యమంత్రి దీనిని రెండు దశల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి దశలో భాగంగా ఇందిరా గాంధీ జయంతి రోజు నుంచి ప్రారంభించి, డిసెంబరు 9 (తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం) వరకు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు చీరల పంపిణీ పూర్తి చేయాలి. మిగిలిన పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు మార్చి 1 నుంచి మార్చి 8 వరకు చీరల పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి నేడు మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు.

అనంతరం సెక్రటేరియట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల మహిళలతో నేరుగా ముఖాముఖి మాట్లాడనున్నారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల గౌరవాన్ని పెంచడంతో పాటు, చేనేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించడం ప్రభుత్వ లక్ష్యం.

# చెరువులకు గుర్రపు డెక్క గండం

- చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు
- కొన్ని చెరువులలో మట్టి పోసి కబ్జాలు
- ప్రశ్నార్థకంగా మారిన చెరువుల ఉనికి
- మేడ్చల్ మండలంలో 130 చెరువులు
- 130 చెరువుల్లో తగ్గుతున్న నీటి నిల్వలు
- పట్టించుకోని అధికారులు
- గుర్రపు డెక్కతో నిండిపోతున్న చెరువులు
- దెబ్బ తింటున్న మత్స్యకారుల జీవనోపాధి

**మేడ్చల్ మండలానికి గుండెకాయగా ఉన్న చెరువుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. చెరువులను, కుంటలను రక్షించుకోవడంలో పాలకులు, అధికారులు విఫలమవుతున్నారు. చెరువుల్లో, కుంటల్లో భారీగా పేరుకపోయిన గుర్రపు డెక్కలను, పిచ్చి మొక్కలను తొలగించే ప్రయత్నాలు జరగడం లేదు. మరోవైపు కొన్నిచోట్ల అక్రమార్కులు చెరువులు, కుంటల స్థలాలలో మట్టి పోసి కబ్జాలు చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యం భూగర్భ నీటి నిల్వలకు గండంగా మారుతున్నది. భూగర్భ జలాల చార్జింగ్ కూడా తగ్గే ప్రమాదమున్నది. మేడ్చల్ మండలంలో 130 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల్లో పూడికతీత పనులు లేక నీటి నిల్వ సామర్థ్యాలు తగ్గిపోతున్నాయి. మత్స్యకారుల జీవనోపాధి పూర్తిగా తగ్గిపోయి చెరువులు ఆందోళనకరణ పరిస్థితులపై "ప్రజా ప్రశ్న" ప్రత్యేక కథనం**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ మండలంలో 130 చెరువులు, కుంటలు మొదలగు నీటి నిల్వ కేంద్రాలు ఉన్నాయి. ఈ చెరువులు, కుంటలుపైనే ఆధారపడి దశాబ్దాల నుంచి వ్యవసాయం సాగింది. చెరువుల ద్వారా భూగర్భ జలమట్టాలు పెరగడం అదే విధంగా చెరువు నుండి నిర్మించిన కాలువల ద్వారా వ్యవసాయ భూములకు నీరు అందుతుంది. సాధారణంగా ఎండాకాలం రాగానే చెరువులు, కుంటల్లో నీరు తగ్గిపోవడం జరుగుతుంది. ఆ సమయంలో స్థానిక పాలకులు, రైతులు చెరువుల్లో పూడికలు తీసి మట్టిని వ్యవసాయ భూములకు తరలిచేవారు. తద్వారా చెరువు నీటి నిల్వ సామర్థం పెరిగేది. అదే విధంగా తీసిన మట్టి ద్వారా వ్యవసాయ భూములకు భూసారం లభించేది. మారిన పరిస్థితుల్లో వ్యవసాయ విస్తీర్ణం పెరిగింది. రైతులు చెరువులు, కుంటలు, కాలువలు కాకుండా బోర్ల ద్వారా నీటి పంపింగ్ తో సాగు చేయడం ప్రారంభమైంది. చెరువుల్లో నీరు తగ్గిపోయినప్పుడు భూమి అడుగుల నుంచి రైతులు బోర్ల ద్వారా నీటిని సాగు భూములకు మళ్లించుకునేవారు. కాగా రైతులు పోటీపడి ఎక్కువ బోర్లు వేయడం, వేసిన బోర్ల లోతును భారీగా పెంచడంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయి.

### కబ్జాలకు మాయమైపోతున్న చెరువులు..

మేడ్చల్ మండలంలో భూముల విలువలు పెరగడంతో అక్రమార్కుల కళ్ళు సమీపంలోని చెరువులు, కుంటలపై పడ్డాయి. నిబంధనలకు విరుద్ధంగా కొందరు చెరువు శిఖం భూముల్లో మెల్లగా మట్టి పోసి కబ్జాలు చేయడం ప్రారంభమైంది. ప్రభుత్వ రికార్డుల్లో 130 చెరువులు ఉన్నప్పటికీ సుమారు 20 శాతం చెరువులు మాయమైనట్టు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పాక్షికంగా, కొన్ని సంపూర్ణంగా కబ్జాకు గురయ్యాయి. చెరువులు, కుంటలను గతంలో పంచాయతీ రాజ్ శాఖ వారు నిర్వహించేవారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు చెరువుల వ్యవహారాన్ని నీటిపారుదల శాఖకు బదిలీ చేశారు. అంతకు ముందున్న రికార్డులను యధాతథంగా నీటి పారుదల శాఖ నమోదు చేసుకున్నది .ఈ విషయంలో క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి రికార్డుల ప్రకారం చెరువులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని వారు చూడలేదు. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా అటు కబ్జాలకు ఇటు గుర్రపు డెక్కలు, పిచ్చి మొక్కలతో చెరువుల నీటి నిల్వల సామర్థం తగ్గిపోతుంది.

### చెరువులకు గుర్రపు డెక్కతో శాపాలు..

రైతులు బోర్వెల్స్ పై ఎక్కువగా ఆధారపడడం ప్రారంభం కావడంతో చెరువులు, కుంటలు నిర్లక్ష్యానికి గురికాడం ప్రారంభమయ్యాయి. చెరువుల్లో, కుంటల్లో గుర్రపు డెక్కలు, పిచ్చి మొక్కలు, గడ్డి మొక్కలు భారీగా పెరగడం జరుగుతుంది. వీటిని ఎప్పటికప్పుడు తొలగించడానికి చర్యలు సరిగా లేకపోవడంతో క్రమక్రమంగా చెరువులు, కుంటలు నిలువల సామర్థం తగ్గుముఖం పడుతుంది. దీంతో పాటు చెరువుల చుట్టూ ఉన్న భూములకు నీరు అందడానికి దోహదపడుతున్న ఊటలు మూసుకుపోతున్నాయి. దీంతో పాటు చెరువుల్లో, కుంటల్లో పేరుకపోయిన గుర్రపు డెక్కలకు చిక్కుకొని అమాయకులైన ఎందరో వ్యక్తులు జల ప్రమాదాలకు గురవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో చెరువుల్లోని తామరపూల కోసం వెళ్లిన అమాయకులు నీటిలో మునిగిపోయిన ప్రమాదాలు జరిగాయి. ఇప్పటికైనా చెరువుల్లో, కుంటల్లో పెరుగుతున్న గుర్రపు డెక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### గుర్రపు డెక్క తో మత్స్యకారుల జీవనోపాధికి పెద్ద దెబ్బ..

మండలం పరిధిలోని స్థానిక చెరువులో ఇటీవల పెరిగిన గుర్రపు డెక్క (జలపాయి ఆకులు) గంగపుత్రుల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీశాయి. చెరువుపై పూర్తిగా విస్తరించిన ఈ పచ్చిక పొర కారణంగా చేపలు ఊపిరాడక చనిపోవడంతో పాటు నీటి మట్టం తగ్గిపోయింది. దీంతో ఏండాది పొడవునా చేపల వేటపై ఆధారపడి జీవనం సాగించే మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయని వారు వాపోతున్నారు.చెరువులో చేపల పెంపకం కోసం పెట్టిన వలలు, విడిచిన పిల్లచేపలు కూడా గుర్రపు డెక్క వల్ల నష్టమయ్యాయని మత్స్యకారులు పేర్కొన్నారు.

వలలు వేసినా పట్టేది మాత్రం టెక్క తప్ప మరేదీ కాదని చెబుతున్నారు. దీంతో రోజు వారీగా సంపాదించే ఆదాయం పూర్తిగా లేకుండా పోయిందని, కుటుంబ పోషణ కష్టమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చెరువును శుభ్రం చేసి గుర్రపు డెక్క తొలగిస్తేనే తమకు జీవనోపాధి అందుతుందని మత్స్యకారులు కోరుతున్నారు.

# మదీనా చేరుకున్న మంత్రి అజారుద్దీన్ బృందం

## - సహాయక చర్యలు ముమ్మరం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో మరణించిన 45 మంది ఉమ్రా యాత్రికుల కుటుంబాలకు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం మంగళవారం మదీనా నగరానికి చేరుకుంది. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫియుల్లా, ఏఐఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌లతో కూడిన ఈ బృందం, సౌదీ అధికారులు మరియు జెడ్డాలోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంతో సమన్వయం చేసుకుంటోంది. జెడ్డాలోని భారత కాన్సుల్ జనరల్ ఫహద్ అహ్మద్ ఖాన్‌తో తాము సమావేశమైనట్లు మంత్రి అజారుద్దీన్ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. "మృతుల కుటుంబాల ఆకాంక్షలకు అనుగుణంగా గౌరవప్రదంగా అన్ని కార్యక్రమాలు పూర్తి చేస్తున్నాం, ఈ కష్టకాలంలో వారికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నాం" అని మంత్రి తెలిపారు.ఆదివారం రాత్రి మదీనా నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో యాత్రికులతో వెళుతున్న బస్సు, డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో మంటలు చెలరేగి హైదరాబాద్‌కు చెందిన 45 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన ఒక యాత్రికుడు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మతపరమైన సంప్రదాయాల ప్రకారం మృతుల అంత్యక్రియలు సౌదీ అరేబియాలోనే నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వం పేర్కొంది. సోమవారం జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశ నిర్ణయం మేరకు ఈ ఉన్నతస్థాయి బృందాన్ని సౌదీకి పంపారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ప్రతి కుటుంబం నుంచి ఇద్దరిని సౌదీ అరేబియాకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విదేశాంగ శాఖ, సౌదీ అధికారులతో సమన్వయం చేస్తూ సహాయక చర్యలను వేగవంతం చేశారు. బాధితులకు సహాయం అందించేందుకు జెడ్డాలోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం మదీనాలో ఒక క్యాంప్ ఆఫీసును కూడా ఏర్పాటు చేసింది

# ఏ కంపెనీ కూడా ఏఐ ప్రభావాన్ని తట్టుకోలేదు

## - 'ఏఐ'పై సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కృత్రిమ మేధ (ఏఐ) అంశంపై గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ బుడగ పగిలితే ప్రతి కంపెనీపై ఆ ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెట్టుబడులు పెరుగుతున్నాయని, ఇదో అసాధారణ సందర్భమని, ప్రస్తుతం కొనసాగుతున్న 'ఏఐ' బూమ్‌లో హేతుబద్ధత లేదని అన్నారు. ఒకవేళ ఏఐ విస్ఫోటనం చెందితే దాని ప్రభావం అంతటా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ విస్ఫోటనాన్ని ఎదుర్కొనే స్థితిలో గూగుల్ సంస్థ ఉందా? అని అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ, ఆ తుఫాన్‌ను తమ కంపెనీ తట్టుకుటుందని, కానీ ఏదైనా సాధ్యమే అని ఆయన అన్నారు. వాస్తవానికి ఏ కంపెనీ కూడా ఏఐ ప్రభావానికి లోనుకాకుండా ఉండలేదని అన్నారు. ఆ జాబితాలో తమ సంస్థ కూడా ఉందని సుందర్ పిచాయ్ అన్నారు. చాట్‌జీపీటీ, ఓపెన్‌ఏఐతో పోటీ ఉన్న నేపథ్యంలో ఆల్ఫాబెట్‌కు పెట్టుబడులు రెట్టింపు అయినట్లు చెప్పారు. ఏఐకి చెందిన సూపర్ చిప్స్‌ను ఆల్ఫా సంస్థ డెవలప్ చేస్తోందని తెలిపారు. ఏఐ చెప్పే ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మకూడదని అన్నారు.

# తలసానిని కలిసిన కొత్త ఎమ్మెల్యే నవీన్ యాదవ్

## - ఆశీస్సులు అందుకున్న యువ ఎమ్మెల్యే

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాజీమంత్రి, బీఆర్ఎస్ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఉపఎన్నికలో విజయం సాధించిన అనంతరం నవీన్ యాదవ్, తలసాని ఆశీస్సులు తీసుకున్నారు. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ట్వీట్ చేసింది. జూబ్లీహిల్స్‌లోని తలసాని నివాసానికి వెళ్లిన నవీన్ యాదవ్, ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. బంధుత్వరీత్యా నవీన్ యాదవ్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అల్లుడు అవుతారు. నవీన్ యాదవ్, తలసాని సోదరుడి కుమార్తెను పెళ్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచిన నేపథ్యంలో నవీన్ యాదవ్‌ను తలసాని అభినందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన రాజకీయ ప్రస్థానానికి సీనియర్ నేత, కుటుంబ



సభ్యుడు అయిన తలసాని ఆశీస్సులు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588